Published From Hyderabad, Mahabubnagar and Kadapa

# వార్తాతరంగాలు

జాతీయ దిన పత్రిక

website: www.vaarthatarangalu.com    email:vtarangalu.222208@gmail.com




Published from mahabub nagar | సంపుటి :26 | సంచిక :157 సంపాదకులు: కోటకొండ ఎల్ల విజయరాజు | శనివారం 17 అక్టోబర్ 2026 | పేజీలు :12 | వెల రూ5 /-

## కాన్స్ వేదికగా..
# తెలంగాణ హవా

### డిసెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో ఇండియాజాయ్ 9వ ఎడిషన్!

**హైదరాబాద్ అక్టోబరు 16 :**ఫ్రాన్స్‌లోని కేన్స్ నగరం వేదికగా జరుగుతున్న ప్రపంచ ప్రసిద్ధ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ కంటెంట్ మార్కెట్ మిప్‌కామ్ కాన్స్ 2026లో తెలంగాణ ప్రభుత్వం తన పెట్టుబడుల ప్రచారాన్ని హోరెత్తించింది. అంతర్జాతీయ వినోద రంగ దిగ్గజాలతో తెలంగాణ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ప్రత్యేకంగా భేటీ అయి, రాష్ట్రంలో స్టూడియో పెట్టుబడులు, సంయుక్త నిర్మాణాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై విస్తృత చర్చలు జరిపింది. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి. అజిత్ రెడ్డి నేతృత్వంలో ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి , ఏవిజిసి డైరెక్టర్ వల్లభి ఎ., కన్సల్టెంట్ స్వభావ్ శెట్టిలతో కూడిన బృందం ఇండియా పెవిలియన్‌లో ప్రత్యేక తెలంగాణ స్టాల్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని చలనచిత్ర పరిశ్రమ, సాంకేతిక సామర్థ్యం, మానవ వనరులు , ప్రతిష్టాత్మక ఇమేజ్ టవర్స్ ప్రాజెక్ట్‌ను గ్లోబల్ దిగ్గజాలకు వివరించారు. ఈ అంతర్జాతీయ సదస్సులో సోనీ, డ్రీమ్‌వర్క్స్ యానిమేషన్, అమెజాన్ ఎమ్జీఎమ్ స్టూడియోస్‌లతో పాటు కొలంబియాకు చెందిన కార్యాకోల్ టెలివిజన్, బ్రెజిల్ గ్లోబో , స్పెయిన్ ఆర్‌టీవీఈ , లాటిన్ మీడియా కార్ప్, టీజీ ఎంటర్‌టైన్‌మెంట్, అరబ్ మీడియా టీవీ ప్రొడక్షన్ వంటి ప్రపంచవ్యాప్త మీడియా సంస్థలతో తెలంగాణ బృందం సమగ్రంగా చర్చించింది. స్టూడియో నిర్వహణ, యానిమేషన్, విఎఫ్ఎక్స్ ప్రొడక్షన్, ఒరిజినల్ కంటెంట్ డెవలప్‌మెంట్, ఫార్మాట్ అడాప్టేషన్, డబ్బింగ్–లోకలైజేషన్ రంగాల్లో తెలంగాణలోని సృజనాత్మక సంస్థలకు గ్లోబల్ మార్కెట్



అవకాశాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగాయి. దీనికి తోడు దక్షిణ కొరియా , మలేషియా , ఫిలిప్పీన్స్ ఫిల్మ్ అకాడమీలతో దేశాల మధ్య నైపుణ్యాల మార్పిడికి భాగస్వామ్యాలు కుదుర్చుకుంది. ఈ మిప్‌కామ్ కాన్స్ వేదికపైనే తెలంగాణ విఎఫ్ఎక్స్, యానిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్ భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మక - మిగతా3లో

## పునర్విభజన బిల్లుపై
# కేంద్రం కసరత్తు..

### ప్రత్యేక సమావేశం దిశగా అడుగులు..?

**న్యూఢిల్లీ:** ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మహిళా రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లుల ఆమోదం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించే అంశంపై కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ బిల్లులకు అవసరమైన మద్దతు కూడగట్టేందుకు ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలతో కేంద్రం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక సమావేశం నిర్వహణపై కేంద్రం కసరత్తు చేస్తోందని, త్వరలోనే సమావేశ తేదీలపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. కాగా, మహిళా రిజర్వేషన్ల అమలుతో పాటు లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు–2026ను ఏప్రిల్ 17న కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అయితే, ఆ బిల్లుకు అవసరమైన మద్దతును కూడగట్టడంలో కేంద్రం విఫలమైంది. మరోవైపు, నీట్ పేపర్ లీక్‌పై ప్రతిపక్షాల నిరసనలు, విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వ చర్యల నేపథ్యంలో వర్షాకాల సమావేశాల్లో బిల్లులను తిరిగి ప్రవేశపెట్టాలన్న కేంద్రం ప్రయత్నాలు ముందుకు సాగలేదు. దీంతో ఈ



ప్రతిపాదనలను మరోసారి పార్లమెంట్ ముందుకు తీసుకురావాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. ఇందుకోసం తనకు మద్దతిచ్చే పార్టీల సంఖ్యను పెంచుకునేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు 22 మంది ఎంపీలు ఉన్న డీఎంకేతో కేంద్రం చర్చలు జరుపుతోందని సమాచారం. అలాగే, మరికొన్ని చిన్న పార్టీలతోనూ సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మరోవైపు, అక్టోబర్ 26, 27 తేదీల్లో పార్లమెంట్‌లో 12వ బ్రిక్స్ పార్లమెంటరీ - మిగతా3లో



# ఢిల్లీలో నిరసనలు..

### వ్యాపార నష్టాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**ఇంటర్నెట్ డెస్క్:** దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళనలు, నిరసనల కారణంగా వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఢిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. సీజేపీ తలపెట్టిన నిరసనల నేపథ్యంలో సెంట్రల్ పార్క్‌ను మూసివేయాలని న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (చీణవీజ) ఆదేశాలు జారీ చేయడం, దీనివల్ల భారీగా వ్యాపార నష్టాలు వస్తాయని ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ.. వ్యాపారాలకు ఎటువంటి అక్రమ అంతరాయం కలిగినా కోర్టు జోక్యం చేసుకుంటుందని స్పష్టం చేసింది. అయితే, ఈ తరుణంలో తక్షణ ఉత్తర్వులు జరపడానికి నిరాకరించిన కోర్టు, - మిగతా3లో

## ఎల్‌నినో పంట నష్టానికి
# ఎకరానికి రూ.10 వేలు

### కీలక నిర్ణయం తీసుకోనున్న రేవంత్ సర్కార్

**హైదరాబాద్ అక్టోబరు 16:** ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొని పంట నష్టపోయిన తెలంగాణ రైతాంగాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఎండిపోయిన ప్రతీ ఎకరా పంట పొలానికి రూ. 10,000 చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం ప్రాథమికంగా భావిస్తోంది. వర్షాభావం వల్ల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పంట దిగుబడులు దారుణంగా పడిపోవడమే కాకుండా, ఎకరాలకు ఎకరాలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. ఈ పరిస్థితుల నుంచి వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించేందుకు రేవంత్ ప్రభుత్వం తక్షణ ఉపశమన చర్యలకు శ్రీకారం చుట్టింది. పంట నష్టపరిహారం, కరువు సహాయక చర్యలపై తుది నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం అత్యవసర అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. అన్ని రాజకీయ పక్షాల నేతలు, రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ రంగానికి చెందిన నిపుణులతో సీఎం రేవంత్ రెడ్డి, ఇంధన , వ్యవసాయ శాఖ మంత్రులు విస్తృతంగా చర్చించనున్నారు. జిల్లాల వారీగా నమోదైన పంట నష్టం వివరాలు, ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రాంతాల జాబితాను



ఈ సమావేశంలో సమీక్షించి, ఎకరానికి రూ. 10 వేల నష్టపరిహార ప్రకటనపై అధికారిక ముద్ర వేయనున్నారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా, ఎల్‌నినో సృష్టించిన ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా ప్రత్యేక ఆర్థిక సాయం కోరాలని తెలంగాణ కేబినెట్ యోచిస్తోంది. ఎల్‌నినో తీవ్రత వల్ల తెలంగాణ వ్యాప్తంగా సంభవించిన భూగర్భ జలాల క్షీణత, ఎండిపోయిన చెరువులు మరియు పంట నష్టంపై - మిగతా3లో

## రాహుల్ తాటాకు
# చప్పుళ్లకు భయపడం

**: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ**

**పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ**

**2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య**



కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన “తాటాకు చప్పుళ్లు”గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు - మిగతా3లో

## ఇది కాంగ్రెస్
# తెచ్చిన కరవు

**రేవంత్ రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి**

**ఏపీల జలపండుగ..తెలంగాణలో క్రాప్ హాలిడే**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్:**సింగరేణి నిండా కుంభకోణాలు ఉన్నాయని నేను చెప్పినా. కాంగ్రెస్ చేసిన కుంభకోణాలని ప్రజల ముందు పెడితే రేవంత్ రెడ్డి, నిన్న అడ్డగోలుగా మాట్లాడిండు. నువ్వు ఉత్తరం రాస్తే నేను విచారణకు ఆదేశిస్తా అన్నాడు. మీడియా ముందు మాట్లాడుడు కాదు, దమ్ముంటే సింగరేణి కుంభకోణం పైన ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోళ్లపైన విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. శుక్రవారం అయన తెలంగాణ భవన్ లో నిర్వహించిన నర్సంపేట నియోజక వర్గ సమావేశంలో మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ ఆఅంశంలోనే కాదు, దమ్ముంటే నువ్వు చేసిన అక్రమాలపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణకి ఆదేశించు. నీ బావమరిది సింగరేణిలో కొల్లగొట్టిన రూ. 10వేల కోట్ల కుంభకోణంపై విచారణ వెయ్యి. సింగరేణిలో నువ్వు చేసిన సోలార్ పవర్ కుంభకోణం బయటపెడతా. సింగరేణిని బొందపెట్టి



ఇప్పుడు 70 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన సింగరేణిని కాదని విదేశీ బొగ్గు తేవడానికి కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. గతంలో రాష్ట్రంలో 24 గంటల పాటు కరెంట్ పోకుండా అండగానిలబడింది సింగరేణి. ఇప్పుడు అదే సింగరేణిని బద్నామ్ చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. సంక్షోభంలోకి నెట్టిన తర్వాత ఇప్పుడు ముఖ్యమంత్రి బొగ్గు తేవాలి, కరెంట్ కొనాలి అని అంతా ఆగమైనంక - మిగతా3లో

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో
# తుమ్మల భేటీ..

### తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రానికి కీలక వినతులు

**హైదరాబాద్, అక్టోబర్ :** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో తెలంగాణ వ్యవసాయ, చేనేత, సహకార మంత్రిత్వ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు భేటీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రాష్ట్ర అభివృద్ధి నేపథ్యంలో ఈ కింది అంశాలపై కేంద్రానికి వినతి పత్రం సమర్పించారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు మహానది బొగ్గును కేటాయించడం, రాష్ట్రానికి నిరంతర యూరియా సరఫరా చేయడం, ఆర్ఎఫ్‌సీఎల్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడంతో పాటు కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి రూ.100 కోట్ల సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరారు. సత్తుపల్లి బొగ్గు బ్లాక్–III ను సింగరేణికి కేటాయించాలని, భద్రాద్రి కొత్తగూడెంలో



గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటును వేగవంతం చేయాలని తుమ్మల కేంద్రానికి విన్నవించారు. దానితోపాటు రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరినట్లు తెలుస్తోంది. సత్తుపల్లి––కొవ్వూరు రైల్వే లైన్‌కు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, పెనుబల్లి––కొండపల్లి, పాండురంగాపురం––మల్కన్‌గిరి రైల్వే లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి వినతి పత్రం సమర్పించారు.



# సంపాదకీయం

## గిగ్ వర్కలుగా
# మారుతున్న యూత్..

ప్రతి సంవత్సరం కొన్ని లక్షలు మంది డ్రిగీ పట్టాలతో బయటికొస్తున్నారు. ఇందులో కొందరు మాత్రమే మంచి ఉద్యోగాలు సాదించి ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారు. కానీ ఇలా డిగ్రీ పట్టా చేతితో పట్టుకొని.. సరైన ఉద్యోగ అవకాశాలు దొరక్కా.. ఎంతో మంది పార్ట్‌టైం జాబ్‌గా ఫుడ్ డెలివరీ జాబ్స్‌కు పరిమితమవుతున్నారు. ఇలాంటి వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది.. మరీ ఇది వారి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది. కళాశాల నుంచి డిగ్రీ పట్టాతో ప్రతి ఏడాది కొన్ని లక్షల మంది యువత బయటకు వస్తున్నారు. ఇలా బయటకొచ్చిన ఓ గ్రాడ్యుయేట్ ఓ సాధారణ రెజ్యూమెతో ఉద్యోగాల కోసం వెతుక్కుంటూ.. సరైన జాబ్ దొకకా తర్వాతి అడుగు ఎటు వేయాలో తెలియని అయోమయంలో పడిపోతునానారు. చివరికి అద్దె బైక్‌పై ఫుడ్ డెలివరీ చేస్తూ, రోజూవారీ ఖర్చులు వెళ్లదీసుకుంటూ, ఎప్పటికైనా తాను చదివిన చదువుకు తగిన ఉద్యోగం లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తూ జీవితాన్ని గడిపేస్తున్నారు. మన దేశంలో ఏటా లక్షలాది మంది యువతీ, యువకులు ఎదుర్కొంటున్న ఈ చదువు పూర్తి కావడానికి -- సరైన ఉపాధి దొరకడానికి మధ్య ఉండే ఖాళీ వ్యవస్థలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ పరివర్తన కాలాన్ని అనుకోకుండా వదిలేయకుండా, ఒక పద్ధతి ప్రకారం డిజైన్ చేశారు. ముఖ్యంగా జర్మనీలో అమలవుతున్న డ్యూయల్ అప్రెంటిస్‌షిప్ విధానం ప్రపంచానికే రోల్ మోడల్‌గా నిలుస్తోంది. అక్కడ విద్యార్థులు సగం సమయం తరగతి గదిలో, మిగిలిన సగం వాస్తవ పని ప్రదేశంలో గడుపుతూ వేతనం పొందుతారు. సుమారు 8.3 కోట్ల జనాభా ఉన్న జర్మనీలో దాదాపు 13 లక్షల మంది అప్రెంటిస్‌లుగా ఉన్నారు. అంటే వారి మొత్తం జనాభాలో వీరు 1.5 శాతానికి పైగా ఉంటారు.భారత్‌లోనూ దీనికి సమానంగా నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ ఉంది. కానీ ఇక్కడి గణాంకాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. 140 కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో, 2024--25 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద నమోదైన అప్రెంటిస్‌ల సంఖ్య కేవలం 9.85 లక్షలు మాత్రమే. అంటే జనాభా నిష్పత్తి ప్రకారం చూస్తే జర్మనీ కంటే ఇది దాదాపు 20 రెట్లు తక్కువ.ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అవకాశాలు లేకపోవడం సమస్య కాదు. అధికారిక నివేదికల ప్రకారం, దేశవ్యాప్తంగా అప్రెంటిస్‌షిప్ పథకం కింద ఏకంగా 70 లక్షలకు పైగా ఖాళీలు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. సమస్య ఖాళీల కొరత కాదు, యువత వీటి కోసం దరఖాస్తు చేయకపోవడమే. 2022లో 42.8 లక్షలుగా ఉన్న దరఖాస్తులు, 2025 నాటికి ఏకంగా 4 లక్షలకు పడిపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.చదువు నుంచి కెరీర్‌కు వారధిగా నిలవాల్సిన లక్షలాది పోస్టులను నిరుద్యోగ యువత ఎందుకు ఎంచుకోవడం లేదు? అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే.. దీని వెనుక బలమైన ఆర్థిక కారణాలు కనిపిస్తున్నాయి. అప్రెంటిస్‌షిప్‌లలో సాధారణంగా నెలకు రూ.10,000 నుంచి రూ.15,000 వరకు మాత్రమే స్టైపెండ్ ఇస్తారు. దీనికోసం వేరే నగరాలకు వెళ్లి అక్కడే ఉండాలి.. పైగా ట్రైనింగ్ తర్వాత ఉద్యోగం వస్తుందన్న గ్యారెంటీ ఉండదు. దీంతో చాలా మంది దీనివైపు మొగ్గుచూపట్లేదని నివేదికలు చెబుతున్నారు.అదే సమయంలో దీనికి భిన్నంగా ఫుడ్ డెలివరీ, క్యాబ్ డ్రైవింగ్, రిటైల్ స్టోర్లలో పని వంటి గిగ్ ఉద్యోగాలు వెంటనే డబ్బును అందిస్తున్నాయి. సొంత ఊరిలోనే ఉంటూ పనిచేసుకునే వెసులుబాటు ఉండటం, దీర్ఘకాలిక ఒప్పందాలు లేకపోవడంతో కుటుంబ అవసరాలు తీర్చుకోవాల్సిన యువత అప్రెంటిస్‌షిప్ కంటే గిగ్ పనులకే మొగ్గు చూపుతున్నారు.గిగ్ వర్క్ తాత్కాలిక ఆదాయానికి, ఉపాధికి మంచి మాధ్యమమే అయినప్పటికీ.. ఇది భవిష్యత్తులో అధిక వేతనాలు, స్థిరమైన కెరీర్‌ను ఇచ్చే సర్టిఫైడ్ నైపుణ్యాలను అందించలేదు. అదే క్రమబద్ధమైన అప్రెంటిస్‌షిప్ అయితే తరగతి గది పాఠాలను పరిశ్రమ అవసరాలకు అనుసంధానించే నైపుణ్యాన్ని ఇస్తుంది. కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో శిక్షణ ద్వారా కెరీర్‌ను నిర్మించుకోవడం కంటే, చేతికి వెంటనే డబ్బు తెచ్చిపెట్టే తాత్కాలిక పనుల వైపే భారతీయ యువత అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.యువత తీసుకుంటున్న ఈ నిర్ణయం వారి ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సరైనదే కావొచ్చు. కానీ లక్షలాది ఖాళీలు అందుబాటులో ఉన్నా, ఒక క్రమబద్ధమైన శిక్షణా విధానాన్ని యువత ఎందుకు కాదనుకోవాల్సి వస్తుందన్నదే అసలు ప్రశ్న. వ్యవస్థాగత విధానాలు, స్టైపెండ్ స్థాయిలు, భవిష్యత్ ఉద్యోగ భద్రత వంటి అంశాలలో మార్పులు రానంత వరకు ఈ అంతరం ఇలాగే కొనసాగే ప్రమాదం ఉంది.

## కాక్రోచ్‌లకు దేశం
# బయట నుంచి ఫుల్ సపోర్ట్

**ఢిల్లీ, అక్టోబరు 16:**దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకుని గందరగోళం సృష్టిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ వెనుక అంతర్జాతీయ శక్తులు పనిచేస్తున్నాయన్న అనుమానాలకు రోజురోజుకూ బలమైన సాక్ష్యాలు లభిస్తున్నాయి. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకలలో అల్లర్ల ద్వారా ప్రభుత్వాలను కూల్చివేసి అరాచకం సృష్టించిన కలర్ రివల్యూషన్ మోడల్‌ను ఇప్పుడు భారతదేశంలోనూ ప్రయోగించేందుకు అంతర్జాతీయ స్థాయిలో పెద్ద కుట్ర జరుగుతోందన్న వాదనలు తెరపైకి వస్తున్నాయి. విచిత్రమేమిటంటే.. భారత్‌లో కాక్రోచ్ పార్టీ నిర్వహించే నిరసనలకు క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజల నుంచి కనీస స్పందన గానీ, స్వచ్ఛంద మద్దతు గానీ లభించడం లేదు కానీ విదేశీ గడ్డల నుంచి, విదేశీ లాబీయిస్టుల నుంచి మాత్రం వీరికి అనూహ్యంగా వెల్లువలా సమర్థన లభిస్తుండటం యావత్ దేశాన్ని విస్మయానికి గురిచేస్తోంది.ప్రతీసారీ భారత్‌కు వ్యతిరేకంగా స్వరం వినిపించే భారత సంతతికి చెందిన అమెరికన్ డెమోక్రాట్ నాయకురాలు ప్రమీలా జయపాల్ వంటి విదేశీ రాజకీయ ప్రముఖుల నుంచి మొదలుకొని, భారత చట్టాల ఉల్లంఘనలతో గతంలోనే దేశం నుంచి బహిష్కరణకు గురైన వివాదాస్పద ఆమ్నెస్టీ



ఇంటర్నేషనల్ వరకు అందరూ కాక్రోచ్ ముఠాకు బాహాటంగా వకాల్తా పుచ్చుకుంటున్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విధించిన ఆంక్షలను మానవ హక్కుల ఉల్లంఘన గా చిత్రీకరిస్తూ ఆమ్నెస్టీ అంతర్జాతీయ వేదికలపై ప్రకటనలు గుప్పించడం, అరెస్టయిన కాక్రోచ్ నాయకులను బేషరతుగా విడుదల చేయాలంటూ డిమాండ్లు చేయడం చూస్తుంటే.. వీరంతా ఒకే విదేశీ స్క్రిప్ట్‌ను పాటిస్తున్నారన్నది తేటతెల్లమవుతోంది.ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను వ్యతిరేకించే కొందరు బడా సంపన్నులు, అంతర్జాతీయ దోనర్లు కాక్రోచ్ పార్టీకి, దాని నేత అభిజీత్ దిప్కేకు భారీగా విదేశీ నిధులు సమకూరుస్తున్నారంటూ ప్రముఖ అమెరికన్ గాయని మేరీ మిల్బెన్ ఇటీవల చేసిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం ఆర్థికంగా, వ్యూహాత్మకంగా ప్రపంచ అగ్రరాజ్యాల సరసన నిలబడటాన్ని జీర్ణించుకోలేని కొన్ని విదేశీ శక్తులు.. విదేశాల్లో చదువుకున్న వ్యక్తులను పావులుగా వాడుకుంటూ స్థానికంగా గొడవలు రగిల్చేందుకు నిధులు కుమ్మరిస్తున్నారని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.సొంత దేశంలో ప్రజలు తిరస్కరించినప్పటికీ.. అమెరికా నేతలు, విదేశీ మీడియా, నిషేధిత స్వచ్ఛంద సంస్థలు పదేపదే వీరికి అంతర్జాతీయ కవరేజీ ఇస్తుండటం టూల్‌కిట్ రాజకీయాలను స్పష్టంగా రుజువు చేస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. బంగ్లాదేశ్, శ్రీలంక తరహాలో దేశాన్ని సంక్షోభంలోకి నెట్టేందుకు విదేశాల నుంచి అందుతున్న ఈ అదృశ్య హస్తాలపై నిఘా వర్గాలు మరింత లోతుగా దృష్టి సారించాల్సిన అవసరముందని, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

# ఉస్మానియా.. ఎందుకీ కష్టాలు

**హైదరాబాద్ అక్టోబరు 16:**హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఉస్మానియా ఆసుపత్రి పేరుకు పెద్దాసుపత్రి అయినా లోపల పరిస్థితులు పూర్తిగా దారుణంగా మారాయి. రోజువారీ వైద్యం కోసం వేలాది మంది రోగులు వస్తున్నప్పటికీ కనీస వసతులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. చిన్న ఎక్స్ రే తీయాలన్నా యంత్రాలు పనిచేయక రోగులు తమ స్మార్ట్ ఫోన్లలో ఫొటోలు తీసుకుని వైద్యులకు పంపాల్సిన దుస్థితి నెలకొంది. మూలపడిన సీటీ స్కాన్ యంత్రాలు రోగుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. 15 సంవత్సరాల క్రితం ఉన్న సౌకర్యాలు కూడా నేడు కరువయ్యాయి. ఉచిత వైద్యం అందే ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం కోల్పోయి రోగులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. డాక్టర్లే స్వయంగా రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేపట్టాల్సి వస్తోందంటే అక్కడి సమస్యల తీవ్రత ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఆరోగ్యశ్రీ నిధులు సకాలంలో విడుదల కాకపోవడం, సప్లయర్లు మందుల సరఫరా నిలిపివేయడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. రూ.600 కోట్ల పెండింగ్ బకాయిలు ఉన్నట్లు సమాచారం.ఉస్మానియా ఆసుపత్రిలో కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ వంటి 18 రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు ఉన్నా గుండె జబ్బుతో వచ్చేవారికి స్టెంట్ వేసే నాథుడు లేడు. ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగి ఏకంగా నాలుగేళ్లు దాటిపోవడం అక్కడి అత్యంత దయనీయ పరిస్థితిని కళ్లకు కడుతోంది. క్యాథ్ ల్యాబ్ పనిచేయకపోవడం వల్ల అత్యవసర సమయాల్లో నిమ్స్ ఆసుపత్రికి రోగులను రిఫర్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనస్తీషియా విభాగంలో కీలక పరికరాలు లేవు. ఆర్థోపెడిక్ సర్జరీలకు అవసరమైన ఇంప్లాంట్లు రావడం లేదు. చివరికి కుట్లు వేసేందుకు ఉపయోగించే నీడిల్స్ సూచర్ మెటీరియల్స్ కూడా అందుబాటులో లేవని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చేసే బైపాస్ యంత్రానికి కనీసం బ్యాటరీ బ్యాకప్ కూడా లేదు. ఈ సమస్యల కారణంగా వైద్య విద్యార్థుల శిక్షణ కూడా తీవ్రంగా



దెబ్బతింటున్నది. ఆపరేషన్ థియేటర్లలో సౌకర్యాలు లేకపోవడంతో శస్త్రచికిత్సలు అర్ధంతరంగా ఆగిపోతున్నాయి.ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం దాతలు దొరికినా సర్జరీ చేసేందుకు అవసరమైన పరికరాల కొరత వేధిస్తోంది. ఐదు నెలలుగా లివర్ మార్పిడి కోసం తిరుగుతున్న చిన్నారి పరిస్థితి ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. అనుమతులు అన్నీ లభించినా మందులు లేవనే సాకుతో వైద్యం ఆలస్యం అవుతోంది. ప్రైవేట్ ఆసుపత్రులలో లక్షలాది రూపాయలు ఖర్చు చేయలేక మధ్యతరగతి పేద ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆసుపత్రికి అవసరమైన మందులు సర్జికల్స్ సప్లై చేసేందుకు ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ నిరాకరించింది. ఒక్క ఉస్మానియా ఆసుపత్రి నుంచి మాత్రమే సుమారు రూ.35 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని సప్లయర్లు చెబుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా ఆరోగ్యశ్రీ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని వారు వాపోతున్నారు. పాత బకాయిలు పూర్తిగా చెల్లిస్తేనే మళ్లీ సరఫరా ప్రారంభిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఈ నిధుల కొరత కారణంగా అన్ని రకాల వైద్య సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి.తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా అందాల్సిన మందుల సరఫరా కూడా నిలిచిపోయింది. ఉస్మానియా మాత్రమే కాకుండా అనుబంధంగా ఉన్న ఎమ్ఎన్‌జే, పేట్లబురుజు మెటర్నిటీ, నీలోఫర్ ఆసుపత్రులలో కూడా పరిస్థితులు ఇందుకు భిన్నంగా లేవు. వైద్య విద్యార్థులు పీజీ సీట్లు సాధించి ఇలాంటి పెద్దాసుపత్రికి వచ్చినా సరైన రోగుల శస్త్రచికిత్సలు నేర్చుకోలేకపోతున్నారు. వైద్య పరికరాలు రిపేర్ చేయించే నాథుడు లేకపోవడంతో లక్షలాది మంది రోగుల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయి. అధికారులు ప్రభుత్వ పెద్దలు స్పందించి పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని అంతా కోరుతున్నారు. బకాయిలన్నీ చెల్లించి సప్లయర్లు మళ్లీ ముందుకు వస్తేనే ఆసుపత్రి గాడిన పడుతుంది. లేకపోతే నిరుపేదలకు వైద్యం అందడం అసాధ్యంగా మారుతుంది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే రోజు ఎప్పుడ వస్తుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఉస్మానియా ఆసుపత్రిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వైద్య పరికరాల కొనుగోలుకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. మూలనపడిన యంత్రాలను వెంటనే బాగు చేయించి అందుబాటులోకి తీసుకురావాలి. సప్లయర్లతో చర్చలు జరిపి బకాయిల సమస్యను పరిష్కరించాలి. అత్యవసర మందులు సర్జికల్స్ కొరత లేకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలి. అప్పుడే రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది. లేదంటే పెద్దాసుపత్రిలో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంటుంది. వైద్యులు రోడ్డెక్కి నిరసన తెలపాల్సిన దుస్థితి పోయి ప్రశాంతంగా వైద్యం అందించే వాతావరణం కల్పించాలి. అనుబంధ ఆసుపత్రుల పరిస్థితిని కూడా మెరుగుపరచాలి. యువతకు సరైన శిక్షణ అందేలా చూడాలి. ప్రభుత్వ స్పందనపైనే ఉస్మానియా భవిష్యత్తు ఆధారపడి ఉంది.

## ఎల్నినో దెబ్బకు భగ్గుమంటున్న మార్కెట్..
# జనం విలవిల!

**హైదరాబాద్ అక్టోబరు 16 :**బతుకమ్మ, దసరా పండుగల వేళ నిత్యావసరాల ధరలు హడలెత్తిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వ్యాపించిన తీవ్ర ఎల్నినో ప్రభావం వల్ల వర్షాలు సరిగా పడక జలాశయాలు అడుగంటిపోవడంతో వరి, పప్పుధాన్యాల దిగుబడితో పాటు కూరగాయల ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. ఈ పరిణామం మార్కెట్లో తీవ్ర కొరతకు దారితీయడంతో సరుకుల ధరలు ఆకాశాన్నంటాయి. దీనికి తోడు దసరా పండుగ ప్రయాణాల కోసం ఆర్టీసీ స్పెషల్ బస్సుల పేరిట 50 శాతం అదనపు ఛార్జీలు బాదడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్ తలకిందులై తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.మ్యాప్‌లు చూడండిదిగుబడి తగ్గడంతో వ్యాపారులు అడ్డగోలుగా రేట్లు పెంచేశారు. గత నెలలో హోల్‌సేల్‌లో కిలో రూ.65 ఉన్న హెచ్ఎంటీ జైశ్రీరాం బియ్యం ఏకంగా రూ.95కి చేరగా, రూ.45 ఉన్న సోనామసూరి రూ.70కి ఎగబాకింది. సెప్టెంబరులో కిలో రూ.76 ఉన్న శనగపప్పు ధర రూ.96కు,



రూ.96 ఉన్న పెసరపప్పు రూ.110కి పెరిగాయి. గతంలో నెలకు నిత్యావసరాలు, కూరగాయల కోసం రూ.9,500 ఖర్చయితే, ప్రస్తుతం రూ.12 వేలు దాటుతుండటంతో సగం నెలకే పర్సులు ఖాళీ అయి అప్పులు చేయాల్సి వస్తోందని నగరవాసులు వాపోతున్నారు.నిత్యవసరాలతో పాటు ముడిపదార్థాలు, మెమరీ చిప్‌ల ధరలు పెరగడంతో స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఏసీల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. డిజిటల్‌స్టాక్ గణాంకాల ప్రకారం ఆన్‌లైన్ ల్యాప్‌టాప్‌ల సగటు ధరలు 32 శాతం, ఏసీలు 11 శాతం, స్మార్ట్‌ఫోన్ల ధరలు 7 శాతం పెరిగాయి. పండుగకు సొంతూర్లకు వెళ్దామనుకునే ప్రయాణికులపై ఆర్టీసీ స్పెషల్ బస్సుల పేరుతో 50 శాతం అదనపు ఛార్జీల భారం మోపడంతో పండుగ సంతోషం సగమైపోతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వర్షాభావం వల్ల కూరగాయల కొనుగోళ్లు తగ్గి వ్యాపారులు కూడా తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. రాబోయే 15-20 రోజుల్లో వర్షాలు పడకపోతే ఆహారధాన్యాల ధరలు మరో 10 నుంచి 20 శాతం పెరిగే ప్రమాదముందని వ్యాపారులు హెచ్చరిస్తున్నారు. పండుగ సీజన్‌లో డిమాండ్ ఏకంగా 30 శాతం వరకు పడిపోయిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సరుకుల అక్రమ నిల్వలను అరికడితేనే ధరలు కొంతైనా అదుపులోకి వస్తాయని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# శ్రీశైలంలో వైభవంగా దసరా మహోత్సవాలు

**కాత్యాయని అలంకారంలో శ్రీ అమ్మవారు..**

**రాత్రి పుష్పపల్లకీ సేవ**

: శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం శ్రీ అమ్మవారికి కాత్యాయని అలంకారం నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, చండీహోమం, చండీ పారాయణం, చతుర్వేద పారాయణం, కుమారీ పూజలతో పాటు రుద్రహోమం, రుద్ర పారాయణలు నిర్వహించారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండేళ్ల నుంచి పదేళ్లలోపు బాలికలకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి కుమారీ పూజలు నిర్వహించారు. నవదుర్గల్లో ఆరవ రూపమైన కాత్యాయని దేవిని ఆరాధించడం వల్ల రోగాలు, శోకాలు, భయాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం.ఈ రోజు శ్రీ స్వామిఅమ్మవార్లకు హంసవాహన సేవ నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి ఆస్థానసేవ, సువాసినీ పూజలు, 10 గంటలకు కాళరాత్రి పూజ జరగనున్నాయి. అనంతరం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పుష్పపల్లకిపై శ్రీ స్వామిఅమ్మవార్లను మేళతాళాల నడుమ ఊరేగించనున్నారు. ఈ సేవలో బంతి, చామంతి, కనకాంబరం, రోజాలు, ఆర్కిడ్స్ తదితర పుష్పాలను వినియోగించనున్నారు.

వార్తాతరంగాలు



## కాంగ్రెస్ ఓటు చోరీ సభ

# సొంత ప్రభుత్వంపైనే అవిశ్వాసమా?

**హైదరాబాద్ అక్టోబరు 16:**తెలంగాణ వేదికగా భారీ ఎత్తున ఓటు చోరీ సభను నిర్వహించాలని, దీనికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయించింది. కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా, దేశంలో ఈవీఎంల దుర్వినియోగం , ఓటర్ల తొలగింపుపై జాతీయ స్థాయిలో సాగిస్తున్న పోరాటంలో భాగంగా హైదరాబాద్‌లో ఈ బహిరంగ సభను ప్లాన్ చేశారు. అయితే, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ గడ్డపై ఈ రకమైన సభను నిర్వహించడం రాజకీయంగా పెద్ద వ్యూహాత్మక తప్పిదమని, ఇది తమ సొంత ప్రభుత్వం సాధించిన ప్రజానుకూల విజయాన్ని తమకు తామే ప్రశ్నించుకోవడం లాంటిదని పొలిటికల్ సర్కిళ్లలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.గత శాసనసభ ఎన్నికల్లో ఇదే కేంద్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణలో, అవే ఈవీఎంల ద్వారా జరిగిన పోలింగ్‌లోనే కదా కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 64 స్థానాలు సాధించి, పదేళ్ల బిఆర్ఎస్ రహిత పాలనకు తెరదీస్తూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో పీఠాన్ని అధిరోహించింది? తాము గెలిచిన రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియ అంతా పవిత్రంగా, పారదర్శకంగా జరిగిందని.. ప్రజా తీర్పు వెల్లువెత్తిందని సంబరాలు చేసుకుని, బిజెపి, ఇతర ప్రత్యర్థి పార్టీలు గెలిచిన చోట్ల మాత్రం ఓటు చోరీ జరిగిందని ప్రచారం చేయడం పచ్చి ద్వంద్వ నీతి కాదా అన్న ప్రశ్నవినిపిస్తోంది. సోషల్ మీడియా వేదికల్లోనూ కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్ల నుంచి, ముఖ్యంగా



ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి శ్రేణుల నుంచి సెటైర్లు పేలుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇక్కడ ఈవీఎంలు సరిగ్గా పనిచేసి, పక్కనే ఉన్న మహారాష్ట్ర , లోక్‌సభ ఎన్నికల్లో ఫలితాలు తేడా వస్తే ఈవీఎంలలో తప్పు ఉందనడం ఎంతవరకు సమంజసమని నెటిజన్లు నిలదీస్తున్నారు. సొంత రాష్ట్రంలో సభ పెట్టి ఓటు చోరీ అనడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాధించిన విజయంపై కాంగ్రెస్ అధిష్ఠానమే అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు సంకేతాలు వెళ్తున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో మోదీ ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో పడేసేందుకు చేస్తున్న ఈ పోరాటం.. హైదరాబాద్‌ను వేదికగా చేసుకోవడం వల్ల స్థానిక రాజకీయాల్లో అధికార పార్టీకి తీవ్ర నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది.తెలంగాణలో బిఆర్ఎస్ ఇప్పటికే కాంగ్రెస్ హామీల అమలు నిరసనలు తెలుపుతోంది. ఈ సమయంలో కాంగ్రెస్ స్వయంగా ఈవీఎంలు, ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు రేకెత్తించేలా సభలు నిర్వహిస్తే కాంగ్రెస్ తీరును బిఆర్ఎస్, బిజెపిలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పక్కా ప్లాన్ చేసుకుంటాయి. ఏదైనా రాజకీయ పోరాటం చేసేటప్పుడు ఆ వేదిక ఎక్కడ ఉందనేది అత్యంత కీలకం. బిజెపి బలంగా ఉన్న గుజరాత్, ఉత్తరప్రదేశ్ లేదా మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఈ ఓటు చోరీ సభలను నిర్వహిస్తే కాంగ్రెస్‌కు రాజకీయంగా లబ్ధి చేకూరేది. కానీ తమ సొంత ప్రభుత్వం కొలువుదీరిన తెలంగాణలో ఈ తరహా సభ పెట్టడం వల్ల.. కాంగ్రెస్ గెలిస్తేనేమో ప్రజాస్వామ్యం గెలిచినట్లు.. ప్రత్యర్థులు గెలిస్తే ఓటు చోరీ జరిగినట్లా? అనే ప్రతిపక్షాల విమర్శలకు కాంగ్రెస్ నేతలు సరైన సమాధానం చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం స్థిరమైన పాలన అందిస్తున్న తరుణంలో, రాహుల్ గాంధీని ఇలాంటి వివాదాస్పద అంశంతో తెలంగాణకు తీసుకురావడం కంటే.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించే వేదికగా మార్చుకుంటే కాంగ్రెస్‌కు ఎక్కువ మేలు జరిగేదని ఆ పార్టీలోని సీనియర్ నేతలే గుసగుసలాడుతున్నారు. జాతీయ స్థాయి రాజకీయ ఎజెండాను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవడంలో కాంగ్రెస్ మరోసారి తడబడిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## తెలంగాణ సీఎంవోపై

# పర్సంటేజీ ఆరోపణలు

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టుల టెండర్ల కేటాయింపులు, బిల్లుల చెల్లింపులపై అవకతవకలు, అవినీతి ఆరోపణలు గుప్పిస్తూ ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నామా రమేశ్.. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకత్వానికి లేఖ రాసి దాన్ని మీడియాకు లీక్ చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ పరిధిలోని రేడియల్ రోడ్-2 ప్రాజెక్టు మూడు ప్యాకేజీల టెండర్లలో అక్రమాలు జరిగాయని ఆయన లేఖలో వివరించారు. సాధారణంగా 10 నుంచి 12 పెద్ద కంపెనీలు పాల్గొనే ఇలాంటి ప్రతిష్ఠాత్మక టెండర్లలో.. కేవలం నాలుగు సంస్థలు మాత్రమే పాల్గొనేలా సీఎం కార్యాలయం నుంచి ఇతర కాంట్రాక్టర్లకు బెదిరింపు ఫోన్ కాల్స్ వెళ్లాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగానే నిర్ణయించిన సంస్థలకే పనులు కట్టబెట్టేలా ముందస్తు ఒప్పందాలు కుదిరాయని అందులో పేర్కొన్నారు.ఈ టెండర్ల ప్రక్రియలో సుశీ ఇన్‌ఫ్రా సంస్థను ఉద్దేశపూర్వకంగానే డిస్క్వాలిఫై చేశారని నామా రమేశ్ లేఖలో ప్రముఖంగా లేవనెత్తారు. ఇండో-చైనా సరిహద్దు వంటి అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో 250 కిలోమీటర్లకు పైగా రోడ్లను విజయవంతంగా నిర్మించిన అపార అనుభవం సుశీ ఇన్‌ఫ్రాకు ఉందని తెలిపారు. టెక్నికల్ ఎవాల్యుయేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇచ్చిన అనుభవ పత్రంపై ఎస్‌ఈ కౌంటర్‌సైన్ లేదనే కుంటిసాకుతో దానిని తిరస్కరించారని, ఆ తర్వాత ప్రత్యామ్నాయ పత్రాలు సమర్పించినా అధికారులు నిరాకరించారని పేర్కొన్నారు. ఎల్-1 బిడ్డర్లు నిర్దేశిత విలువ కంటే 3 నుంచి 15 శాతం అధిక ధరలను కోట్ చేయగా.. సుశీ ఇన్‌ఫ్రా కోట్ చేసిన ధరలు దాదాపు రూ.600 కోట్లు తక్కువగా ఉన్నప్పటికీ, ఆ సంస్థను పక్కనపెట్టి ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చారని లేఖలో ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మధ్య ఉన్న రాజకీయ విభేదాల కారణంగానే.. రాజగోపాల్ రెడ్డి కుటుంబానికి చెందిన సుశీ ఇన్‌ఫ్రాను లక్ష్యంగా చేసుకుని



ఈ అన్యాయానికి పాల్పడ్డారని పేర్కొంటూ సంస్థ ఇప్పటికే కోర్టును ఆశ్రయించిందని వెల్లడించారు.ఈ టెండర్ల గోల్‌మాల్‌తో పాటు, రాష్ట్రంలో ప్రాజెక్టుల కేటాయింపులకు గాను కాంట్రాక్టర్ల నుంచి ఏకంగా 15 శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారనే సంచలన ఆరోపణను కూడా లేఖలో ప్రస్తావించారు. ఇది బహిరంగ రహస్యమైనప్పటికీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ నోరు మెదపడం లేదని, కమీషన్లు చెల్లించిన కాంట్రాక్టర్లకే బిల్లుల విడుదలలో ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. గత మూడేళ్లుగా ధ్రువీకరించిన బిల్లులకు సంబంధించి దాదాపు రూ.20,000 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయించుకోవడానికి కూడా భారీ ఎత్తున కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు రాక ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఇప్పటికే పలువురు కాంట్రాక్టర్లు ప్రాణాలు కోల్పోయారని, నిరాశానిస్పృహల్లో ఉన్నారని పేర్కొన్నారు. పాత పనులకు బిల్లులు చెల్లించలేని ప్రభుత్వం.. కొత్త టెండర్లను ఎలా పిలుస్తుందో అర్థం కావడం లేదని నిలదీశారు.ఈ తీవ్రమైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తక్షణమే జోక్యం చేసుకోవాలని నామా రమేశ్ విజ్ఞప్తి చేశారు. ఏ శాఖకు గానీ, రాజకీయ పార్టీకి గానీ ఎలాంటి కమీషన్లు ఇవ్వాల్సిన అవసరం లేకుండా.. బిల్లులన్నీ ఎప్పటికప్పుడు సకాలంలో చెల్లించేలా పారదర్శక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. అధికారం ఉన్నవారితో కుమ్మక్కై పనులు దక్కించుకునే ప్రీ-అరేంజ్డ్ టెండర్ల సంస్కృతికి చరమగీతం పాడుతూ సుశీ ఇన్‌ఫ్రాకు మద్దతుగా నిలవాలని, అర్హులైన కాంట్రాక్టర్లందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ఓపెన్ టెండరింగ్ విధానాన్ని పునరుద్ధరించాలని పిలుపునిచ్చారు. నిర్మాణ రంగాన్ని అవినీతి, అవకతవకల నుంచి కాపాడేందుకు కాంట్రాక్టర్లంతా ఐక్యంగా పోరాడాలని స్పష్టం చేశారు.లేఖను బయట పెట్టడం మాత్రమే కాదు.. మీడియాతోనూ ఇవే ఆరోపణలు చేశారు. ఈ నామా రమేష్‌కు.. ఇంటి పేరు కారణంగా చాలా మంది మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావుకు సంబంధించిన వారని అనుకుంటున్నారు కానీ.. ఈ నామా రమేష్ కు మాజీ ఎంపీకి ఎలాంటి సంబంధం లేదు.

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు....

- మొదటి పేజీ తరువాయి

చెబుతున్నాడు. సింగరేణి బొగ్గు వద్దు, భారతదేశంలో ఉండే బొగ్గు వద్దని అంటున్న ముఖ్యమంత్రి విదేశీ బొగ్గు కావాలి అంటున్నాడు. ఆస్ట్రేలియా నుంచి బొగ్గు కొంటే కమీషన్లు వస్తాయి. సింగరేణిలో 3,800కి టన్నుకి దొరికే బొగ్గు, విదేశాలలో అయితే 10, 12 వేలు వస్తాయి కాబట్టి అక్కడ కమీషన్లు కొట్టడం కోసమే ఈ కుట్ర చేస్తున్నాడు. రేవంత్ రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి. ఈఎంఐ కట్టకుంటే ఈయన పదవి పోతుంది. కాబట్టే ఇప్పుడు బొగ్గు పేరుతో స్కామ్ చేసి ముడుపులు కట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. కాంగ్రెస్ కి కట్టే ఈఎంఐల కోసమే ఇక్కడ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ఉన్నాడు. ఈ రికవరీ ఏజెంట్ లాంటి ఈ ఏఐసీసీ జనరల్ సెక్రటరీకి రేవంత్ రెడ్డి కమీషన్లు కట్టకుంటే ఆయన పదవిని గుంజి పడేస్తాడు. రేవంత్ రెడ్డి పదవి రెన్యువల్ కాదు. రేవంత్ రెడ్డి అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇప్పుడు అందరిని మోసం చేస్తున్నాడు. సింగరేణి భుజం మీద తుపాకీ పెట్టి టెండర్లు, కమీషన్లు లెక్కలు వేసుకుంటున్నాడు.సింగరేణిలో ఉత్పత్తి తగ్గించిండు. అందుకే ఈరోజు కరెంట్ ఉత్పత్తి కేంద్రాల దగ్గర బొగ్గు లేదు. సింగరేణికీ రూ. 60వేల కోట్ల బాకీలు పెండింగ్ లో పెట్టి బొగ్గు ఇవ్వడం లేదని బద్నామ్ చేస్తున్నాడు. కరెంట్ సరఫరా వ్యవస్థను పండబెట్టి ఇప్పుడు రేవంత్ రెడ్డి కొందామంటే కరెంట్ లేదని అబద్ధాలు చెబుతున్నాడు. ఒకనాడు 24 గంటల కరెంట్ వచ్చిన తెలంగాణలో ఇప్పుడు కరెంట్ ఎందుకు లేదు? కరెంట్ కొనుగోలు కోసం ఛత్తీస్ ఘడ్ తో ఒప్పందం చేసుకుంటే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాన్ని కుంభకోణం అన్నాడు. ఇప్పుడేమో కొందామంటే కరెంట్ లేదు అని చెబుతున్నాడు. 3 రూపాయల 90 పైసలకు అప్పుడు మేము కొంటే కుంభకోణం. అయితే, ఇప్పుడు 15 రూపాయలు పెట్టి కొనాలని చూస్తున్న కాంగ్రెస్ తీరుని ఏమనాలి? కరెంట్ కొనుగోళ్లపైన కుంభకోణం అంటూ ఒక కమిషన్ వేసిండు. బద్నాం చేయడానికి కుట్ర చేసిండు. రాష్ట్రంలో 30 లక్షల కరెంట్ పంపు సెట్లు ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టులకి కరెంట్ కావాలి, తెలంగాణ రైతులకు కరెంట్ ఇయ్యాలి. విద్యుత్ పై ఆధారపడిన కుటీర పరిశ్రమలు, పరిశ్రమలకు విద్యుత్ ఇవ్వాలి. అందుకే ఆనాడు అన్ని ప్రయత్నాలు చేసి 24 గంటల కరెంట్ ఇచ్చాము. కానీ కాంగ్రెస్ రాగానే కరెంట్ కోతలు వచ్చాయి. రేవంత్ రెడ్డి 1000 టీఎంసీల నీళ్లను సముద్రంలో వదిలిపెట్టిండు. ఇప్పటిదాకా సాగునీటి పైన, కరువు పరిస్థితుల పైన స్పందించకుండా కాలం వెళ్ళిపోయినాక ఇప్పుడు నాటకాలు చేస్తున్నాడు. ఆరు నెలల ముందే కాళేశ్వరం నుంచి నీళ్లు ఎత్తిపోయాలని మా పార్టీ తరఫున విజ్ఞప్తి చేశాము. కాళేశ్వరం ప్రాజెక్టులో వృథాగా కిందికి పోతున్న నీళ్లను అక్కడి దాకా పర్యటించి ప్రభుత్వానికి ప్రజలకు చూపించాము. కానీ కాళేశ్వరం ప్రాజెక్టును ఉపయోగిస్తే ఇన్ని సంవత్సరాలు తాను చేసిన దొంగ మాటలు ప్రజలకు ముందు తేలిపోతుందని రేవంత్ రెడ్డి నీళ్లు ఎత్తి పోయలేదు. వృథాగా కిందికి పోయిన నీళ్లు ఎత్తి పోయకుండా ఇప్పుడు ఎల్ నినో పేరుతో చేతులెత్తేసిండు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఎత్తమంటే రేవంత్ రెడ్డి ఎత్తలేదు. ఉన్న నీళ్లు కిందికి పోయాయి, రాష్ట్రంలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయి, తాగునీటికి సాగునీటికి కొరత మొదలయ్యింది. ఇప్పుడు ఎల్ నినో వచ్చింది నేనేం చేసానని రేవంత్ రెడ్డి చేతులెత్తేస్తున్నాడు. ఇదే ఎల్ నినో దేశమంతా ఉంది, పక్కనున్న ఆంధ్రప్రదేశ్ లో కర్ణాటకలో కూడా ఉంది. కానీ ఆంధ్రాలో అక్కడ ముఖ్యమంత్రి జలపండగ చేస్తున్నాడు. 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం దాకా నీళ్లు తీసుకుపోయిండు. 400 టీఎంసీలను పట్టిసీమ పంపుతో ఎత్తిపోస్తున్నాడు. పోతిరెడ్డిపాడు నుంచి మొదలుకొని ఆంధ్రాకి అన్ని ప్రాజెక్టులో నీళ్లు నింపుకున్నారు. ఆంధ్రాలో 700 కిలోమీటర్ల కింది దాకా నీళ్లు తీసుకుపోతే 70 కిలోమీటర్ల దూరమున్న మహబూబ్ నగర్ కి కూడా నీళ్లు తీసుకోపోలేకపోతున్నాడు రేవంత్ రెడ్డి. కాళేశ్వరం పాలమూరు ఎత్తిపోతల ద్వారా ఈరోజు తెలంగాణ దేశానికి అన్నపూర్ణగా నిలుస్తుండే. కానీ కాంగ్రెస్ పాలన వల్ల కరువు దిశగా పోతున్నది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు. ఆంధ్రలో జల పండగ ఎందుకుంటది? తెలంగాణలో కరువు ఎందుకుంటది? తెలంగాణ నుంచి పారే నీళ్లతో ఆంధ్రాలో ప్రాజెక్టులు నిండుతున్నాయి. కానీ తెలంగాణలో క్రాప్ హాలిడే అని కాంగ్రెస్ చెబుతుంది. దండం పెట్టి ప్రభుత్వానికి చెబుతున్నా, రైతులు కష్టాల్లో ఉన్నారు, రాష్ట్రం కష్టంలో ఉంది. రాజకీయాలు పక్కన పెట్టి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వారిని ఆదుకోవాలని అన్నారు.

## కాన్స్ వేదికగా తెలంగాణ హవా

- మొదటి పేజీ తరువాయి

ఇండియాజాయ్ 9వ ఎడిషన్ షెడ్యూల్‌ను ప్రతినిధి బృందం అధికారికంగా ప్రకటించింది. టీవాగా ప్రెసిడెంట్, గ్రీన్ గోల్డ్ యానిమేషన్ సీఈఓ రాజీవ్ చిలక, టీవాగా జనరల్ సెక్రటరీ మైక్ యాతంలతో కలిసి ఈ ప్రకటన చేశారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ ఇండియాజాయ్ 2026 ఈవెంట్.. డిసెంబర్ 7 నుంచి 13 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ లో భాగంగా జరగనుంది. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రతిపాదించిన స్టోరీస్, గేమ్స్, డ్రీమ్స్ అనే ఇతివృత్తంతో ఈ వేడుకలు అలరించనున్నాయి.2018లో ప్రారంభమైన ఇండియాజాయ్.. ఫిల్మ్, యానిమేషన్, విఎఫ్ఎక్స్, గేమింగ్, ఈ-స్పోర్ట్స్, కామిక్స్, ఓటీటీ, ఏఐ సాంకేతికతలకు ఆసియాలోనే అతిపెద్ద కన్వర్జెన్స్ వేదికగా నిలిచింది. ఈ 9వ ఎడిషన్‌లో భాగంగా హైదరాబాద్ కామిక్ కాన్, డ్రీమ్‌హాక్ ఇండియా, విఎఫ్ఎక్స్ సమిట్, దేశీటూన్స్, ఓటీటీ పల్స్, ఇండియన్ ఫిల్మ్ కాంక్లేవ్ , ఇండియాజాయ్ ఏఐ కాంక్లేవ్ వంటి 11 ప్రధాన ఈవెంట్లు జరగనున్నాయి. ఇక్కడ యానిమేషన్-ఫిల్మ్ కంటెంట్ మార్కెట్లు, ఇన్వెస్టర్ కనెక్ట్ ప్రోగ్రామ్‌లు, ప్రొడక్ట్ లాంచ్‌లు మరియు బిజినెస్-టు-బిజినెస్ సమావేశాలు నిర్వహించి, లోకల్ క్రియేటర్లను గ్లోబల్ కొనుగోలుదారులు , ఇన్వెస్టర్లతో అనుసంధానించనున్నారు.మిప్‌కామ్ కాన్స్ ద్వారా తెలంగాణ ఏవిజిసి రంగానికి ఉన్న విదేశీ ఆకాంక్షలను ప్రపంచ మీడియా దిగ్గజాల ముందు నేరుగా ప్రదర్శించగలిగామని ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి. అజిత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కేన్స్‌లో ప్రారంభమైన ఈ సుదీర్ఘ చర్చలను రాబోయే డిసెంబర్ 7-9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'లో పూర్తిస్థాయి పెట్టుబడులుగా, అంతర్జాతీయ ఒప్పందాలుగా మలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా సంస్థలను, అంతర్జాతీయ ప్రతినిధులను డిసెంబర్‌లో హైదరాబాద్‌కు రావాల్సిందిగా ఈ సందర్భంగా తెలంగాణ బృందం ఆహ్వానించింది.

## పునర్విభజన బిల్లుపై కేంద్రం కసరత్తు..

- మొదటి పేజీ తరువాయి

ఘోరం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల తేదీలను ఖరారు చేసే అవకాశం ఉంది. ఒకవేళ ప్రత్యేక సమావేశాల నిర్వహణపై కేంద్రం నిర్ణయం తీసుకుంటే ఇండియా కూటమి ఏ విధంగా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారనుంది.

## ఎల్‌నినో పంట నష్టానికి ఎకరానికి రూ.10 వేలు

- మొదటి పేజీ తరువాయి

సమగ్ర నివేదికను తయారు చేసి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖకు సమర్పించనున్నారు. జాతీయ విపత్తు ఉపశమన నిధి కింద తెలంగాణకు వెంటనే ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరాలని అఖిలపక్ష భేటీలో నిర్ణయించనున్నారు.తెలంగాణ మీడియా వర్గాల సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో దాదాపు పలు జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో వరి, పత్తి, జొన్న మరియు ఇతర వాణిజ్య పంటలు ఎల్‌నినో కారణంగా దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పథకంతో పాటు వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సంయుక్త బృందాలు ద్వారా ఇప్పటికే నష్ట తీవ్రతను గణిస్తున్నారు. సర్వే పూర్తయిన వెంటనే అర్హులైన రైతుల ఖాతాల్లోకి నేరుగా డిబిటి పద్ధతిలో నష్టపరిహార నిధులను జమ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పంట నష్టపోయిన ఏ ఒక్క రైతు కూడా ధైర్యం కోల్పోవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ వర్గాలు భరోసా ఇస్తున్నాయి. శుక్రవారం జరిగే అఖిలపక్ష సమావేశం అనంతరం నష్టపరిహారం పంపిణీకి సంబంధించిన విధివిధానాలు, కాలపరిమితిని ప్రభుత్వం అధికారికంగా వెల్లడించనుంది. రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకుంటున్న ఈ వేగవంతమైన నిర్ణయం ఆర్థిక కష్టాల్లో ఉన్న తెలంగాణ రైతాంగానికి పెద్ద ఊరటనిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు

- మొదటి పేజీ తరువాయి

పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. "ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ఢిల్లీలో నిరసనలు..

- మొదటి పేజీ తరువాయి

తదుపరి విచారణను అక్టోబర్ చివరి వారానికి వాయిదా వేసింది. పండుగ, పెళ్లిళ్ల సీజన్ కావడంతో వ్యాపారాలు మూతపడితే చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారులు, హమాలీల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. కన్నాట్ ప్లేస్ మార్కెట్‌లో ఒక్క రోజు నిరసనల వల్ల సుమారు రూ. 200 కోట్ల వ్యాపారం దెబ్బతింటుందని, అక్టోబర్ 10 నుంచి ఇప్పటివరకు వర్తకులు రూ. 2,000 కోట్ల నష్టాన్ని చవిచూశారని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వర్తకులు ప్రధానంగా మూడు డిమాండ్లను కోర్టు ముందుంచారు: అక్టోబర్ 2026 నుంచి జనవరి 2027 వరకు ప్రధాన మార్కెట్లలో రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలి. నిరసనల కోసం వాణిజ్య ప్రాంతాలకు దూరంగా ప్రత్యేక ప్రదేశాలను కేటాయించాలి. నిరసన హక్కును, వ్యాపారాల హక్కులను సమతుల్యం చేసేలా ఒక ఎస్‌ఓపీని రూపొందించాలి. మరోవైపు, వ్యాపారుల ఆందోళనలపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే స్పందిస్తూ.. శాంతియుత నిరసనల వల్ల వ్యాపారాలు నష్టపోరని, ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి, రవాణాను నియంత్రించి నగరాన్ని యుద్ధభూమిలా మార్చడం వల్లే నష్టాలు వస్తున్నాయని ఎక్స్ వేదికగా విమర్శించారు. ఏది ఏమైనప్పటికీ, పండుగ సీజన్‌లో ఈ నిరసనల అంశం ఢిల్లీ వర్తక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

## కేంద్ర మంత్రివర్గంలో వేడెక్కిన రీషఫుల్

**ఢిల్లీ.అక్టోబరు 16 :** కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం దీపావళి పండుగకు ముందే తమ మంత్రివర్గంలో భారీ మార్పులు, చేర్పులు చేపట్టనుందనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ తన మంత్రి పదవితో పాటు రాజ్యసభ్యత్వానికి హఠాత్తుగా రాజీనామా చేయడంతో కేబినెట్ విస్తరణపై చర్చ ఒక్కసారిగా వేడెక్కింది. గతంలో పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన ఈ కసరత్తుకు ఇప్పుడు అధిష్ఠానం ఆఖరి రూపం ఇస్తోందని, త్వరలోనే కొత్త మంత్రుల చేరిక, ప్రస్తుత మంత్రుల శాఖల మార్పులపై స్పష్టత రానుందని సమాచారం.తమిళనాడులో బిజెపిని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకే మురుగన్ రాజీనామా చేశారని పార్టీ వర్గాలు చెప్తున్నప్పటికీ, కేంద్రంలో ఖాళీ అయిన పదవులను భర్తీ చేయడం అధిష్ఠానానికి అత్యవసరంగా మారింది. అంతకుముందు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యాశాఖ బాధ్యతలను ప్రహ్లాద్ జోషికి అదనంగా అప్పగించారు. ఈ నేపథ్యంలో అదనపు భారంతో ఉన్న శాఖలను విభజించి, కొత్త ముఖాలకు అవకాశం కల్పించడంతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.బి.ఎల్. వర్మ, హర్దీప్ సింగ్ పూరి, జార్జ్ కురియన్, రవ్నీత్ సింగ్ బిట్టు వంటి కీలక నేతల రాజ్యసభ పదవీకాల ముగింపు, పునరుద్ధరణ అంశాలు కూడా కేబినెట్ కూర్పును ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు 2027లో ఉత్తరప్రదేశ్, పంజాబ్ వంటి కీలక రాష్ట్రాల్లో జరగనున్న శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సామాజిక సమతుల్యత దెబ్బతినకుండా పంకజ్ చౌధరి, హర్ష్ మల్హోత్రాల ఉదాహరణల తరహాలోనే ప్రభుత్వ పదవులు, పార్టీ బాధ్యతల మధ్య సమర్థవంతమైన సమన్వయం సాధించడమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోంది

వార్తాతరంగాలు

శనివారం 17 అక్టోబర్ 2026

# హైదరాబాద్‌లో అర్ధరాత్రి నాకాబందీ..

**అదుపులో 48 మంది: సీపీ సజ్జనార్**



**హైదరాబాద్, అక్టోబర్ :** నగరంలో గత అర్ధరాత్రి 'ఆపరేషన్ కవచ్' పేరిట పోలీసులు ప్రత్యేక నాకాబందీ నిర్వహించినట్లు పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ శుక్రవారం హైదరాబాద్‌లో తెలిపారు. దాదాపు 100కుపైగా బృందాలతో ప్రత్యేక నాకాబందీ నిర్వహించామని చెప్పారు. 3 వేల మంది పోలీసులతో విస్తృత తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో 725 వాహనాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే 48 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని అన్నారు. ఈ ఆపరేషన్ కవచ్‌లో 5 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇక ఈ తనిఖీల్లో ఓ ఆయుధం స్వాధీనం చేసుకోగా.. రెండు గంజాయి కేసులు నమోదు చేశామని చెప్పారు. అయితే ఈ తనిఖీల్లో అత్యధికంగా గోల్కొండ జోన్‌లో సరైన పత్రాలు లేని 213 వాహనాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. జూబ్లీహిల్స్ జోన్‌లో 18 వాహనాలు డిటైన్.. 8 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నంబర్ ప్లేట్లు తారుమారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వాహనదారులను హెచ్చరించారు. నంబర్ ప్లేట్లను స్పష్టంగా ఉంచుకోవాలంటూ వాహనదారులకు నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు.

## జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్



ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు. ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎన్నికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా ఇది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాదులోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

## రైతులను త్యాగాలు కోరడమా?: ప్రభుత్వంపై కవిత విమర్శ

**ఎల్ నినో ప్రభావంపై రేవంత్ ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శ**

**ముందస్తు హెచ్చరికలు ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపణ**

**వ్యవసాయ కూలీలకు రూ.12,000, జీవిత బీమా అందించాలని డిమాండ్**




ఎల్ నినో ప్రభావం, రాష్ట్రంలో రాబోయే నీటి కొరతను ఎదుర్కోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వానికి దూరదృష్టి కొరవడిందని ఆమె ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎల్ నినో ప్రభావంపై నిపుణులు ఏడాది ప్రారంభంలోనే హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని అన్నారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరవు మండలాలను ప్రకటించి కేంద్రానికి నివేదికలు సమర్పించాయని, కానీ తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు రైతులను త్యాగాలు చేయాలని కోరడం దారుణమని ఆమె విమర్శించారు. రాబోయే 10 నెలలు రాష్ట్రం తీవ్ర నీటి కొరతను ఎదుర్కోనుందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి దాదాపు 30 నెలలు గడుస్తున్నా ఇంకా పాత ప్రభుత్వంపై నిందలు వేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12,000 ఇచ్చే పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, కరవు పరిస్థితుల దృష్ట్యా వారికి జీవిత బీమా సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.ఇదే సమయంలో, యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కవిత ఆరోపించారు. ఏవైనా ప్రైవేటు కంపెనీలతో ఒప్పందాలు జరిగాయా? అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతూ, రాష్ట్రంలో మాత్రం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

## ఎన్‌హెచ్--65ఆరు లైన్ల విస్తరణ పనులకు ముహూర్తం ఫిక్స్...

**హైదరాబాద్ అక్టోబరు 16:** హైదరాబాద్ నుంచి విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–-65) విస్తరణకు రంగం సిద్ధమైంది. ఏపీ, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, సరుకు రవాణా వాహనాలకు ఈ జాతీయ రహదారి అత్యంత కీలకం. అయితే, ఈ రహదారిపై రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. దీంతో నిత్యం ట్రాఫిక్ జామ్ ల కారణంగా వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా పండుగుల సమయాల్లో హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి చౌటుప్పల్, నల్గొండ, సూర్యాపేట మీదుగా ఆంధ్రప్రదేశ్ వెళ్లే మార్గంలో రద్దీ విపరీతంగా ఉంటుంది. అంతేకాక ఈ రహదారిపై వాహనాల రాకపోకల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రమాదాలుసైతం చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉన్న హైదరాబాద్ -- విజయవాడ జాతీయ రహదారిని ఆరులైన్లుగా విస్తరించేందుకు అనుమతి లభించింది. అయితే, రహదారి విస్తరణ పనులకు ముహూర్తం ఫిక్స్ అయింది.హైదరాబాద్ -- విజయవాడ జాతీయ రహదారి ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉంది. దీనిని ఆరు లైన్ల రహదారిగా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. అయితే, ఈ విస్తరణ పనులు 2027 జనవరి నుంచి ప్రారంభించనున్నట్లు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో సోమవారం ఎన్‌హెచ్ఏఐ ఛైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమై విస్తరణ పనులు, రహదారి భద్రతపై చర్చించారు.రహదారి విస్తరణలో ఆరు ప్రధాన వరుసలతో పాటు సర్వీసు రోడ్లు, జంక్షన్ల మెరుగుదల, సురక్షితంగా రోడ్డు దాటేందుకు అండర్‌పాస్‌లు, అవసరమైన చోట నియంత్రిత ప్రవేశ సదుపాయాలు కీలకంగా మారనున్నాయి.

# రబీ సాగుపై నీలినీడలు..!



**హైదరాబాద్ అక్టోబరు 16:** ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే అన్నదాతలు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఈ సమయంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు అనూహ్యంగా మారాయి. ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు సరిగ్గా కురవలేదు. దీనితో రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. గత ఏడాది 92 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో వరి పంట ఏప్రిల్ వరకు 65 లక్షల ఎకరాలకు చేరింది. పౌర సరఫరాల శాఖ 40 లక్షల టన్నుల ధాన్యం సేకరించింది. ప్రస్తుత వానాకాలంలో కోటి 26 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి.ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే అన్నదాతలు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఈ సమయంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు అనూహ్యంగా మారాయి. ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు సరిగ్గా కురవలేదు. దీనితో రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. గత ఏడాది 92 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో వరి పంట ఏప్రిల్ వరకు 65 లక్షల ఎకరాలకు చేరింది. పౌర సరఫరాల శాఖ 40 లక్షల టన్నుల ధాన్యం సేకరించింది. ప్రస్తుత వానాకాలంలో కోటి 26 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వరి విస్తీర్ణం 57 లక్షల ఎకరాలకు పరిమితమైంది. ప్రభుత్వం ఆరుతడి పంటలు వేయాలని ముందే హెచ్చరించింది. అయినా రైతులు బోరుబావుల మీద ఆశలతో పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు చేతికి వచ్చే దశలో నీరు అందక పంటలు ఎండుముఖం పట్టాయి. రైతులు ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చి పంటలను కాపాడుకోవడానికి పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.యాసంగి సీజన్ రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతాంగానికి అతిపెద్ద సవాలుగా మారుతోంది. ఎల్ నినో ఎఫెక్ట్ వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీనికి తోడు వేసవి కాలం కూడా తోడైతే పరిస్థితి మరింత దిగజారిపోతుంది. రబీ సాగు పూర్తిగా బోరుబావుల మీదనే ఆధారపడి ఉంటుంది. భూగర్భ జలాలు పడిపోవడం వల్ల బోర్లు సరిగ్గా పనిచేయడం లేదు. విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సమీక్షించారు. విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిలిపివేయాలని చెప్పారు. ఓపెన్ మార్కెట్లో కొందామన్నా కరెంటు దొరకని పరిస్థితి ఏర్పడింది. పరోక్షంగా కోతలు తప్పవనే సంకేతాలు రావడంతో అన్నదాతల్లో ఆందోళన పెరిగింది. గత యాసంగితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం భారీగా తగ్గే అవకాశం ఉంది. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఈసారి రబీలో 50 లేదా 60 లక్షల ఎకరాలకు మించి సాగు జరిగే అవకాశం కనిపించడం లేదు.ప్రస్తుత పరిస్థితుల్లో రబీ సాగు క్రాప్ హాలీడే వైపు వెళ్తుందనే చర్చ జోరుగా సాగుతోంది. ఖరీఫ్‌లో పంటలు వేసి ఆర్థికంగా నష్టపోయిన రైతులు అప్పులపాలయ్యారు. ఇప్పుడు మళ్లీ యాసంగిలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరి దగ్గరా డబ్బులు లేవు. బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. ప్రైవేట్ అప్పులు చేస్తే వడ్డీలు కట్టలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో స్వచ్ఛందంగా క్రాప్ హాలీడే ప్రకటించాలా లేక ప్రభుత్వం చెప్పినట్లు ఆరుతడి పంటలు వేయాలా అని ఆలోచిస్తున్నారు. కూరగాయలు పండించినా మార్కెట్లో సరైన గిట్టుబాటు ధర దొరుకుతుందనే నమ్మకం లేదు. మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడం రైతులను మరింత కలవరపెడుతోంది. వ్యవసాయ విశ్వవిద్యాలయం కొత్త ప్రణాళికలు రచిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు చాలా భిన్నంగా ఉన్నాయి. అధికారులు మాత్రం కేవలం వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లాలని పదే పదే సూచిస్తున్నారు. కానీ రైతులు మాత్రం పెట్టుబడి భద్రత లేక వెనుకంజ వేస్తున్నారు.సాగునీటి సమస్యతో పాటు రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య కూడా తీవ్రరూపం దాల్చనుంది. రిజర్వాయర్లలో నిల్వ ఉన్న నీరు సరిపోతుందా లేదా అనే సందేహం అధికారుల్లో నెలకొంది. గ్రామాలకు, పట్టణాలకు తాగునీరు అందించడం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారుతోంది. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన ముగించుకుని రాగానే ఈ అంశంపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఎలాంటి నష్టపరిహారం ప్రకటిస్తారోనని రైతులు చూస్తున్నారు. విద్యుత్ కోతలు లేకుండా చూస్తామని హామీ ఇస్తేనే రైతులు ముందుకు వస్తారు. లేదంటే సాగుకు దూరంగా ఉండటమే మేలని భావిస్తున్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల కేవలం వ్యవసాయ రంగం మాత్రమే కాకుండా అనుబంధ రంగాలు కూడా దెబ్బతిన్నాయి. పాల ఉత్పత్తి తగ్గిపోవడం, పశువులకు దాణా దొరకకపోవడం రైతులను కృంగదీస్తోంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ఈ క్లిష్ట పరిస్థితిని ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుంది, రైతులకు ఏవిధంగా భరోసా ఇస్తుంది అనేది రానున్న కాలంలో తేలనున్న ప్రధానమైన అంశం.ఈ సంక్షోభం నుంచి బయటపడటానికి సమగ్రమైన కార్యాచరణ అవసరం. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సహాయం అందించాలి. గతంలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఎకరానికి 20 వేల రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించి పగటిపూటే 9 గంటల విద్యుత్ ఇవ్వాలని కోరుతున్నారు. లేదంటే గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఆందోళనలకు దిగే అవకాశం ఉంది. ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా డ్రిప్ ఇరిగేషన్ పద్ధతులను ప్రోత్సహించి నీటిని వృథా కాకుండా చూడాలి. అధికారుల పర్యవేక్షణలో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తేనే కొంతవరకు నష్టాన్ని తగ్గించవచ్చు. లేదంటే వ్యవసాయ రంగానికి కోలుకోలేని దెబ్బ తగులుతుంది. వచ్చే యాసంగి సీజన్ రాష్ట్రంలో రైతుల జీవితాలను తలకిందులు చేసేలా కనిపిస్తోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి సరైన నిర్ణయాలు తీసుకుంటేనే అన్నదాతలు ఆత్మహత్యల బారిన పడకుండా బతకగలరు.

# కల్వకుంట్ల కుటుంబాన్ని గతంలో తిట్టి.. ఇప్పుడు పొగడ్తలా..?

**జీవన్ రెడ్డిపై అడ్లూరి లక్ష్మణ్ ఫైర్**

**బీఆర్ఎస్ నేత జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆగ్రహం**

**పార్టీ మారగానే కల్వకుంట్ల కుటుంబం మంచిదైపోయిందా అని ప్రశ్న**

**ఎండిన ఒక్క పొలమైనా చూపించాలని జీవన్ రెడ్డికి సవాల్**



బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీ మారినంత మాత్రాన... ఒకప్పుడు ఆయన తీవ్రంగా విమర్శించిన కల్వకుంట్ల కుటుంబం ఇప్పుడు మంచిదైపోయిందా? అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సూటిగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. ఈరోజు జగిత్యాల అర్బన్ కాలనీలో 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్–స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు జీవన్ రెడ్డి... కేసీఆర్, కేటీఆర్‌తో పాటు కల్వకుంట్ల కుటుంబంపై తీవ్ర విమర్శలు చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని ఆరోపించిన జీవన్ రెడ్డి... ఇప్పుడు పార్టీ మారగానే వారంతా సత్యవంతులుగా కనిపిస్తున్నారా? అని నిలదీశారు. విద్యుత్ సమస్యలపై సాధారణ ఆరోపణలు చేయడం కాదని, నీళ్లు లేక ఎండిపోయిన ఒక్క పొలాన్నయినా చూపించాలని జీవన్ రెడ్డికి సవాల్ విసిరారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ, జీవన్ రెడ్డిని కేబినెట్‌లోకి తీసుకుంటామని స్వయంగా ముఖ్యమంత్రే ప్రతిపాదించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని చెప్పారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని, ఎల్ నినో ప్రభావంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు విద్యుత్ సరఫరాను రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# సికింద్రాబాద్‌లో కేజేఆర్ గార్డెన్ కూల్చివేత

**సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని కేజేఆర్ గార్డెన్ కూల్చివేత**

**అక్రమ ఫంక్షన్ హాల్‌గా నిర్మించారని అధికారుల చర్యలు**

**1996 నుంచి కొనసాగుతున్న న్యాయపోరాటానికి తెర**

**కోర్టు తీర్పుతో రంగంలోకి దిగిన కంటోన్మెంట్ బోర్డు**

**జేసీబీలతో నిర్మాణం నేలమట్టం**



సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో దశాబ్దాలుగా వివాదాస్పదంగా ఉన్న కేజేఆర్ గార్డెన్‌ను కంటోన్మెంట్ బోర్డు అధికారులు శుక్రవారం పూర్తిగా నేలమట్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించి, ఫంక్షన్ హాల్‌గా నిర్వహిస్తున్న ఈ కట్టడంపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. న్యాయస్థాన ఆదేశాల మేరకు ఈ కూల్చివేత ప్రక్రియను చేపట్టారు. శుక్రవారం ఉదయం కంటోన్మెంట్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ యంత్రాలతో కేజేఆర్ గార్డెన్ వద్దకు చేరుకున్నారు. అనంతరం ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని కూల్చివేయడం ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. కొద్ది గంటల వ్యవధిలోనే ఆ నిర్మాణాన్ని అధికారులు పూర్తిగా నేలమట్టం చేశారు. సదరు స్థలంలో అక్రమ నిర్మాణంపై 1996 నుంచి న్యాయస్థానంలో వివాదం కొనసాగుతోంది. కేజేఆర్ గార్డెన్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాల్‌ను నిర్మించి, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తోందని కంటోన్మెంట్ బోర్డు గతంలోనే స్పష్టం చేసింది. దీనిపై సుదీర్ఘకాలం పాటు సాగిన న్యాయపోరాటంలో ఇటీవలే న్యాయస్థానం కంటోన్మెంట్ బోర్డుకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాల మేరకు కంటోన్మెంట్ అధికారులు ఈ కూల్చివేత ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో దాదాపు రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న వివాదానికి తెరపడినట్లయింది. అధికారులు ఈ చర్యతో కంటోన్మెంట్ ప్రాంతంలోని ఇతర అక్రమ నిర్మాణదారులకు గట్టి హెచ్చరికలు జారీ చేసినట్లయింది.

## యాదాద్రిలో ఘోర ప్రమాదం..



**సిలిండర్లు పేలి కార్మికుడి మృతి**

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 16:** జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. దండుమల్కాపురం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో ఆక్సిజన్ సిలిండర్లు పేలడంతో భారీ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఓ కార్మికుడు ప్రాణాలు కోల్పోగా.. మరో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. సిలిండర్లు ఒక్కసారిగా పేలడంతో పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు భయాందోళనలకు గురయ్యారు. పేలుడు ధాటికి అక్కడి పరిస్థితి ఒక్కసారిగా భీతావహంగా మారింది. ప్రమాదంలో గాయపడిన కార్మికుడిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనతో పారిశ్రామికవాడలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతిచెందిన కార్మికుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# రబీలో ఆరుతడి పంటలే సాగు చేయాలి

**విబిజి రాంజీలో జల సంరక్షణ పనులకు ప్రాధాన్యతనివ్వాలి.**

**ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలి**

**ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్ లు లేని పిల్లలకు ప్రత్యేక డ్రైవ్**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**




**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 16(స్కై న్యూస్):**ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున రబీ సీజన్ లో రైతులు తమ బోరు, బావుల్లో నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వెబ్ ఎక్స్ ద్వారా జిల్లా కలెక్టర్ పలువురు అధికారులతో కలెక్టర్ సమావేశమై వివిధ అంశాలపై మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే పనులు పూర్తయ్యేలా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు ప్రతినిత్యం తన పరిధిలోని రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎక్కడైనా పంటలు ఎండిపోతే పూర్తిస్థాయి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాల్సి ఉంటుందన్నారు. రైతులకు వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. విబిజి రాంజీలో జల సంరక్షణ పనులకు ప్రాధాన్యతనివ్వాలని పేర్కొన్నారు. పంట కుంటలు, ఇంకుడు గుంతలు పెద్ద ఎత్తున నిర్మించాలని ఆదేశించారు. ఆయా గ్రామ పంచాయతీలలో చేపట్టాల్సిన పనులపై సర్పంచులు, సంబంధిత అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించుకొని ప్రాధాన్యత క్రమంలో ఆయా పనులను చేపట్టాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీలలో చేపట్టిన పనులపై ఈనెల 30వ తేదీలోగా నివేదిక పంపాలని ఆదేశించారు. ఎల్ నినో నేపథ్యంలో రైతు కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులు కల్పించాలని సూచించారు. క్షేత్ర సహాయకుల మూమెంట్ రిజిస్టర్ ను ఎంపీడీవోలు ప్రతి నెల తమకు పంపాలని ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం కావాలి**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం అయ్యేలా సంబంధిత మండలాల ఎంపీడీవోలు, ఇతర అధికారులు తరచు పర్యవేక్షణ చేస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడ తాగు నీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట బోర్ వెల్స్ రీఛార్జ్, మోటార్ల రిపేర్, తదితర పనులను చేయించాలని ఆదేశించారు. ప్రభుత్వం గొర్రెలు, మేకలకు బీమా పథకాన్ని వర్తింపచేస్తున్నందున పాడి రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలన్నారు. డిగ్రీ ఉత్తీర్ణతై మూడేళ్లు పూర్తయిన వారు గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా దరఖాస్తు చేసుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్స్ లేని పిల్లలకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఎన్రోల్మెంట్ చేయించాలని ఆదేశించారు. ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించినందున ప్రతి శుక్రవారం విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని, ఎక్కడ కూడా ఫుడ్ పాయిజన్ కేసులు కాకుండా పర్యవేక్షించాలన్నారు. చైల్డ్ సేఫ్టీ ఉపాధ్యాయులను కూడా నియమించామని, ఆయా గురుకులాలు, కేజీబీవీలు, వసతిగృహాల విద్యార్థుల సంరక్షణకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శిలు ప్రతి మంగళవారం తమ పరిధిలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. రీ సర్వే పనులను వేగవంతం చేయాలని, లైసెన్స్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, అలసత్వం వహించే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చేపట్టిన అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో మంజుల, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అలంపూర్ జోగులాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు..



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 16(స్కై న్యూస్):**అష్టాదశ (18) శక్తి పీఠాలలో 5వ శక్తి పీఠంగా ప్రసిద్ధి చెందిన అలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయాన్నిరాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, వనపర్తి ఎమ్మెల్యే శ్రీ మేఘా రెడ్డి,ముఖ్యమంత్రి ఎనుముల తిరుపతి రెడ్డి, నాయకులు సంపత్ కుమార్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బ్యాండు మేళాలతో ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.నవరాత్రుల్లో ఆరవ రోజు అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమతి సరితా తిరుపతయ్య జోగులాంబ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ఆలయంలోని శివాలయానికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేసి, హోమ కార్యక్రమంలో పాల్గొని హోమం నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. తదనంతరం ఎనుముల తిరుపతి రెడ్డి ని సన్మానించారు. అనంతరం ఆనంద నిలయం వెంచర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజల సుఖ సంతోషాల కోసం, తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోన్పాడు శ్రీనివాస్ గౌడ్, ఆరగిద్ద సర్పంచ్ బాలకృష్ణ నాయుడు, ధరూర్ శ్రీధర్, సతీష్ ,ఎల్లప్ప, లక్ష్మన్న, ఆనంద్ గౌడ్, అయ్యప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దసరాకు ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త!

**ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి..**

**డయల్ 100కు సమాచారం ఇవ్వాలి: సీఐ వెంకటేశ్వర్లు**



**ఆమనగల్లు, అక్టోబర్ 16(స్కై న్యూస్):**దసరా పండుగను పురస్కరించుకొని సొంతూళ్లకు వెళ్లే ప్రజలు తమ ఇళ్ల భద్రత విషయంలో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. పండుగ సెలవుల నేపథ్యంలో చాలా మంది కుటుంబ సమేతంగా స్వగ్రామాలకు వెళ్లే అవకాశం ఉన్నందున దొంగతనాలు జరగకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.ఇళ్లను ఖాళీ చేసి ఊళ్లకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులు, నగదు, బంగారు ఆభరణాలను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం మంచిదని సూచించారు. ఇంటి తలుపులు, కిటికీలు సరిగా మూసివేసి తాళాలు వేసుకోవాలని, ఇంటి భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. ఎక్కువ రోజుల పాటు ఇంటికి దూరంగా ఉండాల్సి వస్తే నమ్మకమైన పొరుగువారికి సమాచారం అందించి పరిసరాలపై నిఘా ఉంచేలా చూసుకోవాలని సూచించారు.కాలనీలు, వీధుల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తించినా, అనుమానాస్పద సంఘటనలు చోటుచేసుకున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు పోలీసులకు సహకరించడం ద్వారా దొంగతనాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.దసరా పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలని, ఇళ్ల భద్రతకు సంబంధించిన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు.

# బీసీలపై రాజకీయ కక్షలు మానుకోవాలి

**తీరు మార్చుకోకపోతే స్టేషన్ ను ముట్టడిస్తాం**



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 16( స్కై న్యూస్):**నియోజకవర్గంలో బీసీలను అణిచివేసేందుకు రాజకీయంగా దెబ్బ కొట్టేందుకు ఎమ్మెల్యే ఎమ్మెల్సీ రాజకీయ కక్షలకు పాల్పడుతున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు శుక్రవారం మాజీ జెడ్పిటిసి శ్రీశైలం ను పరామర్శించారు అనంతరం బిఆర్ఎస్ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పాలనను గాలికి వదిలి తండ్రి కొడుకులు రాజకీయ కక్షలకు పాల్పడుతూ అణగారిన వర్గాలను అణిచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సాగునీరు విద్యుత్ అందించడంలో పూర్తిగా విఫలం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు పోలీసులను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ నేతలు రౌడీ రాజకీయాలు చేస్తున్నారని వాటిని మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పోలీసులు తమ తీరును మార్చుకోకపోతే వేలాదిమంది బీసీలతో పోలీస్ స్టేషన్ ముట్టడిస్తామని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తిప్పండనం చేస్తామని హెచ్చరించారు. మంతటి చౌరస్తాలో నాగరాజు అనే వ్యక్తి సొంత ప్లాటులు కాంగ్రెస్ పార్టీ దిమ్మెను ఏర్పాటు చేయడం జరిగిందని అతనిని వేధింపులకు గురి చేయడం సరికాదని అన్నారు కానిస్టేబుల్ శివ ప్లాటును కూడా కాంగ్రెస్ నాయకులు కబ్జా చేసి వేధిస్తున్నారని ఆరోపించారు. మాజీ జెడ్పిటిసి శ్రీశైలం మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు నక్కల కొనుగోలులో అవినీతికి పాల్పడినట్లు ఆధారాలతో నిరూపించడం వల్ల జీవించుకోలేక అక్రమ కేసులో ఇరికించి జైల్ కు తరలించారని విమర్శించారు కోర్టులో బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారని ఇలాంటి చర్యలకు పాల్పడితే తమ సత్తా చాటుతామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ నక్కల కొనుగోలులో జరిగిన అవినీతిపై నెలలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఐదు నెలలు కావస్తున్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులపై ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. మాజీ జడ్పిటిసి శ్రీశైలం పై కేసు ముమ్మాటికి రాజకీయ కక్షయ అని అన్నారు ఈ సమావేశంలో నాయకులు నాగయ్య సుధాకర్ యాదవ్ తో పాటు పలువురు పాల్గొన్నారు

# మాజీ సర్పంచ్ కిష్టయ్య మృతి తీరని లోటు,పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి

**కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి**



**పాపన్నపేట. అక్టోబర్ 16(స్కైన్యూస్):**నార్సింగ్ గ్రామ మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నీలగిరి. కిష్టయ్య మృతి వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. కిష్టయ్య మృతి విషయం తెలుసుకొని శుక్రవారం నార్సింగ్ గ్రామానికి చేరుకుని ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించి, కిష్టయ్య ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు జగన్, సర్పంచ్ లు మల్లేశం,సాయిరెడ్డి,ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు కుబేరుడు,నాయకులు సోములు,దుర్గయ్య, బాబాగౌడ్, గోపాల్, అనిల్‌రెడ్డి, బద్రి మల్లేశం, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్,వెంకట్ రాములు,రవీందర్ నాయక్, సామెల్, నర్సింలు,మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..



**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 16( స్కై న్యూస్)** రెండు రెండు ఒకటి జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఉద్యోగుల డిమాండ్లను ముఖ్యమంత్రి మరియు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు శుక్రవారం జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి వివిధ డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ విధానంలో పని చేస్తూ క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆరోగ్య సలహాలు ఇవ్వడంతో పాటు ప్రజారోగ్యానికి నిరంతరం పాటుపడుతున్న తమను నిర్లక్ష్యం చేయడం తగదని వివరించారు. తమను క్రమబద్ధీకరణ చేయడం వల్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అవుతాయని దీనివల్ల ఉద్యోగ భద్రత ఏర్పడుతుందని అనేక పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ వైద్య సేవలు అందించడంలో మీరు చేస్తున్న సేవలు తమకు తెలుసని ఒక వైద్యుడిగా మీకు అండగా ఉంటానని అన్నారు ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు ఉద్యోగులు పాల్గొన్నారు

# ధనలక్ష్మి అలంకరణలో వాసవి మాత...

**అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం**





**నాగర్ కర్నూల్ అక్టోబర్ 16( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న 56వ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం నాడు వాసవి కన్యకా పరమేశ్వరి మూలవిరాట్ కు 11 లక్షల 11వేల,111 రూపాయలతో ధనలక్ష్మి రూపంలో అలంకరించారు భక్తులకు వాసవి మాత ధనలక్ష్మి రూపంలో దర్శనం ఇచ్చారు. ఉత్సవ విగ్రహాలకు పలువురు దంపతులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా సామూహిక పూజా కార్యక్రమాలలో దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు జోషి పాండురంగ శర్మ ఆధ్వర్యంలో గణపతి సుబ్రహ్మణ్యం దుర్గ పూజల అనంతరం లఘు పూర్ణాహుతి మరియు మహా నీరాజనం సమర్పించారు అనంతరం వాసవి భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు ఆకట్టుకున్న అనంతరం అన్న ప్రసాద వికరణ చేపట్టారు. సాయంకాలం నిర్వహించిన కుంకుమార్చన పల్లకి సేవ డోలు ఉత్సవం కార్యక్రమంలో మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు హరిబాబు ఆలయ కమిటీ అధ్యక్షులు మిడిదొడ్డి అంజయ్య తో పాటు పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు వివిధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు. లక్ష్మీ నారసింహస్వామి ఉపాసకులు సోమిశెట్టి నాగరాజు ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహించారు కార్యక్రమంలో వందలాదిమంది ఆర్యవైశ్యులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు అనంతరం అల్పాహారం పంపిణీ చేశారు

# ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అవగాహన సదస్సు

**కౌన్సిలర్ పాపిశెట్టి రాము చేతుల మీదుగా ప్రారంభం**

**ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**




**ఆమనగల్లు, అక్టోబర్ 16(స్కై న్యూస్):**ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అవగాహన సదస్సును కౌన్సిలర్ పాపిశెట్టి రాము ప్రారంభించారు.ఈరోజు కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్లు మండల కేంద్రంలో రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో 2023 సంవత్సరంలోపు డిగ్రీ పూర్తి చేసుకున్న అనేకమంది మహిళలు, పురుషులు పాల్గొని ఓటర్ గా నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్పీ ఫౌండేషన్ బోర్డు డైరెక్టర్ అశ్విన్ కుమార్ మరియు బోర్డు మెంబర్స్ బండల్ల చందు, కొమ్ము కిరణ్ కుమార్, దొబ్బల భాస్కర్, కొప్పు మహేష్, సింగపాకుల రాము, వసుపుల శ్రీకాంత్, యాదగిరి, నాయకులు శ్రీను నాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మూలా నక్షత్ర దీపోత్సవం



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 16(స్కై న్యూస్):**దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం మూలా నక్షత్ర దీపోత్సవం నిర్వహించారు.దేవాలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ తిమ్మప్ప స్వామి కి పంచామృత అభిషేకాలు,అర్చనలు నిర్వహించి మూలా నక్షత్ర దీపోత్సవం నిర్వహించారు.నవరాత్రి సందర్భంగా శ్రీ లక్ష్మీదేవిని సరస్వతి అవతారంలో అలంకరించి పూజించారు. ఈ కార్యక్రమంలో రుక్మంగధ రావు,రాఘవేంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు

శనివారం 17 అక్టోబర్ 2026

# ఇందిరమ్మ ఇళ్లతో ప్రతి పేద కుటుంబానికి భరోసా

**అక్టోబర్16 (స్కై న్యూస్):** నర్వ మండలంలోని కల్వల గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు నూతన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను నిజం చేయాలనే ప్రజా ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్ కాపీలను శుక్రవారం రోజు ఎంపీడీవో శ్రీనివాస్ నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ




**సొంతింటి కల సాకారం దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం**

పేదల సంక్షేమమే లక్ష్యంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్న మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి గారికి, మండల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎంపీవో రాఘవేందర్, ఏఎంసీ వైస్ చైర్మన్ డి. కృష్ణ రెడ్డి , మండల ఉపాధ్యక్షులు శరణప్ప , కల్వల గ్రామ సర్పంచ్ చెన్నప్ప, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు,మండల నాయకులు బీసం రామకృష్ణ , నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి. అశోక్ గౌడ్ మండల సోషల్ మీడియా జ లక్ష్మణ్ గౌడ్,నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, జగదీశ్వర్ రెడ్డి, మనోహర్ రెడ్డి,డబ్బ నరసింహులు, వెంకటరామిరెడ్డి చంద్రకాంత్, బోయపాటి నరసింహ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరీష్, తదితరులు పాల్గొన్నారు

# ఆందోళన కారుల ఖాతాలోకి అమెరికా నుండి డబ్బులు ఎలా వస్తున్నాయి

**అమరాబాద్ స్కై న్యూస్ శుక్రవారం అక్టోబర్ 16** ఢిల్లీలో ఆందోళన చేస్తున్న ఆందోళనకారులు కాక్రోచలు ఆందోళనకారులందం ఏమన్నా కానీ వారి ఖాతాల్లోకి బ్రిటన్ టర్కీ అమెరికా వంటి దేశాల నుండి డబ్బులు ఆందోళనకారుల ఖాతాలోకి ఎలా వస్తున్నాయి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు మండికారి బాలాజీ విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు ప్రపంచ దేశాలలో భారత దేశపు ఖ్యాతి చూసి ఓర్వలేక పాకిస్తాన్ టర్కీ బ్రిటన్ కొన్ని దేశాలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయని అలాగే బాంగ్లాదేశ్ నుండి హసీనా ను అల్లరి చేసి దేశం నుండి బహిష్కరించారు కదా అదే విధంగా భారత దేశంలో కూడా అల్లర్లు సృష్టించాలని కొన్ని దుష్ట శక్తులు దానికి తోడు దౌర్భాగ్యం మనదేశంలోని ప్రతిపక్షాలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయని బాలాజీ గారు అన్నారుబ ఓటు హక్కు లేని పిల్లలు కూడా ఆందోళన కారు ల లు ఉన్నారని రోజుకు 3000 రూపాయలు ఇస్తున్నారని టీవీ మాధ్యమాల్లో చూస్తున్నాం ఎస్ ఐ ఆర్ వద్దని చెప్పే ప్రతిపక్షాలు అలా ఎందుకు అడుగుతున్నాయో చెప్పాలని ఎవరి పోటు లిస్టులో లేదో వాళ్ళు వచ్చి సరిచేసుకోవాలని చెప్తున్నది కదా ప్రభుత్వం మరి ఎందుకు ఆందోళన నిజంగానే ఓట్లు తీసేస్తే ఆ తీసేసిన ఓటర్ వచ్చి ఆందోళన చేయాలి కానీ నాయకులని ఎందుకు ఆందోళన చేస్తున్నారు ఓటు బాక్సుల్లోనే స్కానింగ్ చేస్తున్నారు అని ఆరోపించారు గతంలో మరి ఇప్పుడు ఓట్లు లిస్ట్ అయిందని చెప్తున్నారు. మీరు గెలిచిన రాష్ట్రాల్లో అలా జరగలేదని ప్రతిపక్షాలు గెలిస్తే అక్కడ ఎన్నిక సరిగ్గా జరిగినట్లు లేదా బిజెపి గెలిస్తే అక్కడ కుట్ర జరిగినట్టు ఆరోపిస్తున్నారు ఈ బుద్ధింకల కాక్రుచుల కు సరైన బుద్ధి చెప్పే టైం ప్రజలు తీసుకోవాలని ప్రజలంతా గమనిస్తున్నారని దేశ విచ్చిందానికి కుట్ర జరుగుతుంద పాకిస్తాన్ దాని మిత్రపక్షాలు భారత దేశ అభివృద్ధిని జీర్ణించుకోలేకపోతున్నాయని మండికారి బాలాజీ బిజెపి రాష్ట్ర నాయకులు ఆరోపించారు దేశ భద్రతకు ముప్పు వాటింపజేసే ఈ కాక్రోచ్లు గాని కఠినమైన చర్యలు తీసుకొని దుష్టశక్తులకు భయం అంటే ఏంటో తెలుస్తుంది



# భారతీయ కళా సాంస్కృతిక సేవకై స్వచ్ఛంద సేవా సంస్థలకు ఆహ్వానం

**ఆదిలీల ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆదినారాయణ**

**హైద్రాబాద్ అక్టోబర్ 16:** భారతదేశంలో భారతీయ కళా సాంస్కృతిక ప్రచారానికై మరియు ప్రజల్లో చైతన్యానికై స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని ఆ ఆదిలీల ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆదినారాయణ పిలుపునిచ్చారు మియాపూర్ లోని ఆదిలీల ఫౌండేషన్ కార్యాలయంలో డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ అది లీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను ఢిల్లీలోనూ మరియు ఇతర నగరాల్లోనూ నిర్వహించి ప్రజల్లో మన కలల పట్ల సాంప్రదాయాల పట్ల చైతన్యము మరియు ఐకమత్యం తీసుకుని వచ్చే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు కలిసి వచ్చే స్వచ్ఛంద సేవా సంస్థలను కలుపుకొని భారతదేశం మొత్తం పర్యటించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు అందుకుగాను స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో మాతృదేవోభవ సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేబీ శ్రీధర్ సి నారాయణ ఎక్స్ ఎమ్మెల్యే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సి నాగరాజు పాల్గొన్నారు



# నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని అక్టోబర్ 16(స్కై న్యూస్)** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గోదావరిఖనిలోని 2ూ మైన్, ఓసిపి–5, 5 ఇంక్లైన్, ఇందిరా నగర్, ఎన్ టి పి సి కాకతీయ నగర్, గౌతమ్ నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పలు దుర్గాదేవి మండపాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులను, నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.



# ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన మహేశ్వరం ఏసీపీ జానకి రెడ్డి

## పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగం పెంచాలి -- పోలీస్ సిబ్బందికి సూచనలు

## దసరా వేడుకల భద్రతా ఏర్పాట్లపై సమీక్ష

**ఆమనగల్లు, అక్టోబర్ 16(స్కై న్యూస్):** పోలీస్ స్టేషన్ పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మహేశ్వరం డివిజన్ ఏసీపీ ఎస్. జానకి రెడ్డి సూచించారు. పోలీస్ కమిషనర్, ఫ్యూచర్ సిటీ వారి ఆదేశాల మేరకు శుక్రవారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌ను ఆమె వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించి, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పనితీరుపై సమగ్ర సమీక్ష,వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ సిబ్బంది పరేడ్, టర్నౌట్‌ను ఏసీపీ పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న నేర సంబంధిత రికార్డులు, సీసీటీఎన్ఎస్ పనితీరు, పెండింగ్ కేసులు, శాంతిభద్రతల పరిస్థితి, పెట్రోలింగ్, నిఘా వ్యవస్థ, మహిళల భద్రతకు సంబంధించిన చర్యలు, ప్రజల ఫిర్యాదులు, వారెంట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించారు. పోలీస్ స్టేషన్ పరిపాలనకు సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు రికార్డుల గదులు, స్టేషన్ పరిసరాలను తనిఖీ చేశారు. విధుల నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఏసీపీ జానకి రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. నేరాల నివారణే లక్ష్యంగా సమర్థవంతమైన






పెట్రోలింగ్ నిర్వహించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని,విధుల్లో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరు, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరిధిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

**దసరా వేడుకలకు పటిష్ట భద్రతా చర్యలు**

అనంతరం ఆమనగల్లు కళాశాల మైదానాన్ని ఏసీపీ జానకి రెడ్డి సందర్శించి, అక్కడ నిర్వహించనున్న దసరా పండుగ వేడుకలకు సంబంధించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. పండుగకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు.దసరా పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, సంతోషంగా జరుపుకునేలా పోలీస్ శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్. వెంకటేశ్వర్లు, ఎస్ఐ సంతోష్ రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వెలుగురాళ్ల తండాలో ఘనంగా శ్రీ తుల్జా భవానీ మాత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

## ముఖ్య అతిథిగా హాజరైన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

## ఆలయ పెయింటింగ్ పనులకు రూ.1,20,000 ఆర్థిక సహాయం అందజేత

**ఆమనగల్లు, అక్టోబర్ 16 (స్కై న్యూస్):** కడ్తాల్ మండలం వెలుగురాళ్ల తండాలో శ్రీ తుల్జా భవానీ మాత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది. భక్తి శ్రద్ధలతో, వేద మంత్రాల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మరియు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ వెలుగురాళ్ల తండాలో ఇంతటి పవిత్రమైన తుల్జా భవానీ మాత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఆలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఇందులో భాగంగా వెలుగురాళ్ల తండాలోని శ్రీ తుల్జా భవానీ మాత ఆలయ పెయింటింగ్ పనుల కోసం రూ. 1,20,000 (ఒక లక్షా ఇరవై వేల రూపాయలు) ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు ప్రకటించారు.ప్రజల విశ్వాసాలకు, సంస్కృతికి ప్రతీకలైన ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ప్రజాసేవతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో నిరంతరం భాగస్వామ్యం అవుతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు చిట్టి రమేష్, తేజురాం, ఉప సర్పంచ్ పంత్య నాయక్,మాజీ సర్పంచ్ ఇస్లావత్ పాండు, వార్డు సభ్యులు దశరథ్, మోహన్, కిషన్, సీనియర్ నాయకులు ఇస్లావత్ నగేష్, రవి, కిరణ్, సరియా నాయక్, లోక్య నాయక్, జిలానిలతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు ఎగిరిశెట్టి లింగం, రమేష్, మల్లేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన ఏడుపాయల వనదుర్గాభవానీ అమ్మవారు

## దుర్గానామస్మరణతో మారుమోగుతున్న ఏడుపాయల పుణ్యక్షేత్రం

**పాపన్నపేట /మెదక్, అక్టోబర్ 16,(స్కై న్యూస్ ప్రతినిధి ):** శ్రీ ఏడుపాయల వనదుర్గాభవానీ మాత పుణ్యక్షేత్రం లో దేవీశరన్నవ రాత్రుల మహోత్సవాలు వైభవోపేతంగా అంగరంగవైభవంగా దుర్గానామస్మరణలతో భక్తితన్మయంతో మారుమ్రోగుతున్నాయి. దేవీశరన్నవ రాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శుక్రవారం ఉత్సవ మండపంలో శ్రీ సరస్వతీదేవి అమ్మవారు అలంకారంలో పట్టువస్త్రంలో వన దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం ఆలయ ప్రధాన గర్భాలయంలో శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో అత్యంత అద్భుతంగా ముస్తాబైన వన దుర్గాభవాని అమ్మ వారికి, గోకుల్ షెడ్ లోని ఉత్సవ మండపంలో శ్రీ సరస్వతీదేవి అలంకారంలో ఉన్న దుర్గాదేవి అమ్మవారికి వేద బ్రాహ్మణ పండితులు,ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల విశేష పూజలు నిర్వహించారుఉత్సవ మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, విశేషాలంకరణ పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి భక్తుల పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు ను స్వీకరించారు. ఏడుపాయల్లో దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలతో ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.





# మహబూబ్‌నగర్‌లో నేడు కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

## ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డు నుంచి ఇద్దరు ముఖ్య నాయకులు హాజరుకావాలి - ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, అక్టోబర్ 16 (స్కై న్యూస్):** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు మహబూబ్‌నగర్‌లో కీలక సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. మహబూబ్‌నగర్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు ఈ సమావేశం జరగనున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల కార్యక్రమాల ప్రారంభం నుంచి ఫలితాలు వెలువడే వరకు ప్రతి స్థాయిలో పటిష్ఠమైన సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డు నుంచి ఇద్దరు ముఖ్య నాయకులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు. ఎన్నికల నిర్వహణ, ప్రచార కార్యక్రమాలు, ఓటర్లను సమన్వయం చేసుకోవడం వంటి అంశాల్లో నాయకుల పాత్ర కీలకమని తెలిపారు. గ్రామాలు, పట్టణ వార్డుల స్థాయిలో పార్టీ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఎన్నికల ప్రక్రియలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త పార్టీ విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ నేపథ్యంలో నేడు మహబూబ్‌నగర్‌లో జరగనున్న సన్నాహక సమావేశానికి గ్రామ, మున్సిపల్ వార్డుల నాయకులు సమయానికి హాజరై ఎన్నికల కార్యాచరణను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు.



## ఎల్ నీ నో ప్రభావంతో పంటలు ఎండిపోతుంటే

# తమాషాలు చూస్తున్నారా

**పంటలు ఎండిన రైతులు పండుగ ఎలా చేసుకోవాలి**
**ప్రతి రైతుకు ఎకరాకు 50 వేలు పరిహారం ఇవ్వాలి**
**లేదంటే సర్కారుతో ఇక యుద్ధమే**
**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆగ్రహం**




**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 16 స్కై న్యూస్):** ఎల్ నీ నో ప్రభావంతో పంటలు ఎండిపోతున్నాయి సకాలంలో విద్యుత్ అందించాల్సిన ప్రభుత్వం వేడుక చూస్తుంది పంటలు ఎండిపోయి అవస్థలు పడుతున్న రైతులు పండగ ఎలా చేసుకోవాలి కనీస ప్రణాళిక లేకుండా ప్రభుత్వం ఎలా నడిపిస్తున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇకనైనా స్పందించాలి నష్టపోతున్న అన్నదాతలకు పరిహారం అందించాలి లేదంటే సర్కారుపై ఇక యుద్ధమే అని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై .అంజయ్య యాదవ్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం అన్నదాతలు మాత్రమే కాదు.. సామాన్యులు జీవించాలన్నా వ్యవసాయం బాగుండాలి. వ్యవసాయం బాగుండాలంటే నీరు, విద్యుత్ సమృద్ధిగా ఉండాలి. అందుకే గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ రైతుబంధు ద్వారా ఆర్థిక సాయం, సకాలంలో ఎరువుల పంపిణీ, వ్యవసాయ సమయంలో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమీక్షల నిర్వహణ ద్వారా వ్యవసాయాన్ని విజయవంతంగా ముందుకు నడిపించారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎల్ నినో ప్రభావం వల్ల పంటలు ఎండిపోతుంటే విద్యుత్ ఇవ్వకుండా రైతుల సహనాన్ని పరీక్షిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం పంటలకు 25 రోజులు పూర్తిస్థాయిలో కరెంటు ఇచ్చినా వ్యవసాయం బాగుపడుతుందని, అలాంటి సహకారం ప్రభుత్వం నుంచి లేకపోవడం వల్ల మొక్కజొన్న పూర్తిగా ఎండిపోయిందని, వరి చేలు కూడా పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందే కేసీఆర్ మోసపోతే ఘోషపడతామని చెప్పారని, ప్రస్తుతం అదే జరుగుతుందని అన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే కరెంటు సమస్యలు, ఎరువుల కోసం కొట్టుకోవడం వంటివి జరిగాయని, ఇప్పుడు మళ్లీ అదే పునరావృతం అవుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు కరెంటు ఇవ్వడంలో ఎప్పుడు కూడా రాజీ పడలేదని, కాంగ్రెస్ వచ్చాక ఆ తేడా స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. ఎల్ నీ నో కారణంగా సమస్య ఉత్పన్నం అవుతుందని ముందే తెలిసినప్పటికీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు ఎందుకు చేసుకోలేదని ప్రశ్నించారు. శ్రీశైలం, కాళేశ్వరం ద్వారా నీటిని నిలువ చేసుకొని రైతులకు అందించాల్సిన బాధ్యతను కూడా మర్చిపోయారని అన్నారు. సమీక్షల ద్వారా కనీసం అధికారులను అప్రమత్తం కూడా చేయని దుస్థితి నెలకొందన్నారు. 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేసి అవినీతికి పాల్పడిన చరిత్ర కాంగ్రెస్ కే దక్కుతుందన్నారు. హైడ్రో పవర్ లేకపోతే థర్మల్ పవర్ ద్వారా ఎందుకు విద్యుత్ ఉత్పత్తి చేసుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే చాలా వరకు నష్టం జరిగిందని కానీ ఎక్కడ ఎంత నష్టం జరిగిందో ఈరోజుకు తెలుసుకోలేకపోయారని వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి జరిగిన నష్టానికి రైతులకు ఎకరాకు 50 వేలు చొప్పున పరిహారం అందించాలని సూచించారు. కనీసం ఇంకో 20 రోజులైనా 24 గంటలు విద్యుత్ ఇచ్చి అన్నదాతలకు సహకరించాలన్నారు. లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. నేతలు వి. నారాయణరెడ్డి, ఈట గణేష్, రాజా వరప్రసాద్, లక్ష్మణ్ నాయక్, శ్రీధర్ రెడ్డి, దేవేందర్ యాదవ్, జూపల్లి శంకర్, రవి యాదవ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## దుర్గామాత సన్నిధిలో

# అన్నదానానికి శ్రీకారం

**కొత్తూరులో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 16 (స్కై న్యూస్):** షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన దుర్గామాత సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీవాసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భార్గవ్ గౌడ్, నవీన్ చారి, వేణు చారి, మ్యాధారీ శ్రీనివాస్, హాసన్, గోవింద్, శేఖర్ గౌడ్, పెంటయ్య యాదవ్, రవి యాదవ్, నరసింహ, విక్రమ్, రామకృష్ణ, విశాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యకర్త..
## నువ్వు ఎంతైనా తోపురా..!!

ఇంటికాడ కష్టం ఉన్నా బయటికి చెప్పవు..
జీవితంలో ఇబ్బంది పడుతున్నా..బయట పడనియ్యవు..
ఆర్థికంగా లేకున్నా..ఆస్తిపాస్తులు లేకున్నా..
ఎత్తిన జెండా అధికారంలో రాకున్నా..లేకున్నా..
నీ కండువా నువ్వే కొనుక్కుంటూ..
నీ పెట్రోల్,డీజిల్ నువ్వే పోసుకుంటూ..
నీ తిండి,బండి నువ్వే చూసుకుంటూ..
ఇంటికన్నా ఎక్కువ టైం పార్టీకే ఇచ్చుకుంటూ..
నక్సలైట్లతో ప్రాణాలకు తెగించి కోట్లాడుతావు..
ప్రాణం పోతదని తెలిసినా..త్యాగం చేసైనా నిలబడతావు..
పరాయి దేశపు కిరాయి పార్టీలు నీ దేశంపై కుట్రలు చేస్తే
తిరగబడతావు..తరిమితరిమికొడతావు..
నమ్మిన సిద్ధాంతం కోసం..దేశం కోసం..ధర్మం కోసం..
ప్రత్యర్థులు పైసలు,బీర్ సీసలు కుమ్మరించి రాజకీయం చేస్తున్నా..
ప్రజల కోసం కొట్లాడుతున్న నీపై అక్రమ కేసులు పెట్టినా..
లాఠీఛార్జీలు చేసినా..జైళ్లకు పంపినా..చావగొట్టినా..
చచ్చేవరకు దేశంకోసం కాషాయ జెండా విడువవు..
చచ్చినా నీ దేహంపై కమలం జెండా లేపోతే ప్రాణం విడువవు..
నీకు నువ్వే సాటి..నీకు నువ్వే పోటీ..నీకు నువ్వే మేటి..
అందుకే బీజేపీ కార్యకర్త...నువ్వు చాలా చాలా తోపురా!!
చనాస్పందన చబీజేపీకార్యకర్త చనువ్వుతోపురా

## దసరా పండుగ సందర్భంగా హమాలీలు,స్వీపర్లకు

# రెండు జతల యూనిఫాం దుస్తులు పంపిణీ

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 16(స్కై న్యూస్):**దసరా పండుగను పురస్కరించుకుని హమాలీలు, స్వీపర్లకు యూనిఫాం దుస్తులను అందజేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్ నందు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని హమాలీలు, స్వీపర్లకు రెండు జతల యూనిఫాం దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,దసరా పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని పౌర సరఫరాల సంస్థ ప్రతి ఏటా ఎం.ఎల్.ఎస్. పాయింట్స్‌లో హమాలీలు, స్వీపర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి బోనస్,దుస్తులు అందజేస్తున్నదని అన్నారు. జిల్లాలోని గద్వాల,అలంపూర్, అయిజ,మనోపాడు ఎం.ఎల్.ఎస్. పాయింట్లలో విధులు నిర్వహిస్తున్న 34 మంది హమాలీలు,నలుగురు స్వీపర్లు కలిపి మొత్తం 38 మందికి ఈ ఏడాది దసరా ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరికీ రెండు జతల యూనిఫాం దుస్తులను నేడు పంపిణీ చేసినట్లు తెలిపారు.అదేవిధంగా,ప్రతి హమాలీకి,స్వీపర్‌కు రూ.8,500 ప్రోత్సాహక నగదు,స్వీట్ బాక్స్‌కు బదులుగా రూ.1,000 నగదు ఇప్పటికే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. యూనిఫాం కుట్టు ఖర్చుల నిమిత్తం హమాలీలకు రూ.1,800 చొప్పున, స్వీపర్లకు రెండు బ్లౌజుల కుట్టు ఖర్చుల కోసం రూ.800 చొప్పున నగదును కూడా ముందుగానే జమ చేసినట్లు వివరించారు. హమాలీలు,స్వీపర్లు నిరంతరం కష్టపడి పనిచేస్తూ తమ విధుల పట్ల అంకితభావంతో వ్యవహరిస్తున్నారని కలెక్టర్ అభినందించారు.ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి దసరా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్,హమాలీలు, స్వీపర్లు,సంబంధిత శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నార

## బూర్గుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**రూ.15 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం**
**మోడల్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు.. త్వరలో బస్సు సౌకర్యం కల్పిస్తాం**
**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 16 (స్కై న్యూస్):** ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతలో 31, రెండో విడతలో 14 ఇళ్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. బూర్గులలో తెలంగాణ మోడల్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్లు వెల్లడించారు. గ్రామ ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరలో బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత, విద్యుత్ అంతరాయాలు ఎదురవుతున్న నేపథ్యంలో రైతుల పంటలను కాపాడేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రోజుకు అదనంగా మూడు గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరినట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్య, రవాణా, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, కొత్తూరు టౌన్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, సర్పంచులు యాదగిరి, రాజగోపాల్ రెడ్డి, వడ్ల జంగయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగారి రవి, తాలూకా ఎస్టీ సెల్ అధ్యక్షుడు గణేష్, నాయకులు ముబారక్ అలీ ఖాన్, కుమార్ నాయక్, వెంకటేష్, నర్సప్ప గూడ క్రిష్ణ, శ్రీనివాస్ రెడ్డి, బూర్గుల మాజీ సర్పంచ్ శివకుమార్, గ్రామ అధ్యక్షుడు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



## బాల కార్మిక వ్యవస్థ మరియు
## బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 16 (స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి జి. నిష్కా పాత్రుడు గారి ఆధ్వర్యంలో, 16.10.2026న అయిజ మండలంలోని బింగిదొడ్డి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో "బాల కార్మిక వ్యవస్థ మరియు బాల్య వివాహాల నివారణ" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి జి. నిష్కా పాత్రుడు మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థ మరియు బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. ప్రతి బాలబాలికకు విద్యను పొందే హక్కు ఉందని, పిల్లలను పనుల్లో పెట్టకుండా పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యం, విద్య మరియు భవిష్యత్తుకు ఆటంకం కలిగిస్తాయని వివరించారు. బాల్య వివాహాల నివారణకు తల్లిదండ్రులు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాల నిర్వహణ, ప్రోత్సాహం మరియు అరికట్టడంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె పేర్కొన్నారు. బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఎక్కడైనా బాల కార్మికులు లేదా బాల్య వివాహాల గురించి తెలిసినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా, అర్హులైన మహిళలు, పిల్లలు మరియు ఇతర అర్హతగల వ్యక్తులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహా మరియు న్యాయవాది సేవలు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. ఉచిత న్యాయ సహాయం కోసం జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ టోల్‌ఫ్రీ నంబర్ 15100 కు ఫోన్ చేయవచ్చని సూచించారు. అలాగే, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలలపై వేధింపులు లేదా ఇతర బాలల రక్షణ సమస్యలు ఎదురైనప్పుడు తక్షణ సహాయం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి సునంద మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు, బాల్య వివాహాలను అరికట్టేందుకు తల్లిదండ్రులు, గ్రామస్థులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి బాలబాలికకు విద్య, రక్షణ మరియు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి (ఇజూూ) శ్రీ నరసింహ, బాలల సంక్షేమ కమిటీ (జఔజ) కౌన్సిలర్ శ్రీ జయన్న, గ్రామ సర్పంచ్ శ్రీ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీ రాధా గోపాల్, ఉప సర్పంచ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భారతీయ కళా సాంస్కృతిక సేవకై స్వచ్ఛంద
## సేవా సంస్థలకు ఆహ్వానం



**హైద్రాబాద్ అక్టోబర్ 16:**భారతీయ కళా సాంస్కృతిక సేవకై స్వచ్ఛంద సేవా సంస్థలకు ఆహ్వానం డాక్టర్ ఆదినారాయణ ఆదిలీల ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు భారతదేశంలో భారతీయ కళా సాంస్కృతిక ప్రచారానికై మరియు ప్రజల్లో చైతన్యానికై స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని ఆ దిలీల ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆదినారాయణ పిలుపునిచ్చారు మియాపూర్ లోని ఆదిలీల ఫౌండేషన్ కార్యాలయంలో డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ అది లీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను ఢిల్లీలోనూ మరియు ఇతర నగరాల్లోనూ నిర్వహించి ప్రజల్లో మన కలల పట్ల సాంప్రదాయాల పట్ల చైతన్యము మరియు ఐకమత్యం తీసుకుని వచ్చే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు కలిసి వచ్చే స్వచ్ఛంద సేవా సంస్థలను కలుపుకొని భారతదేశం మొత్తం పర్యటించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు అందుకుగాను స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో మాతృదేవోభవ సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేబీ శ్రీధర్ సి నారాయణ ఎక్స్ ఎమ్మెల్యే చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సి నాగరాజు పాల్గొన్నారు

వార్తాతరంగాలు
శనివారం 17 అక్టోబర్ 2026

## శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి...

**నూతన పోలీసు అధికారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కేశంపేట సీఐ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు**



**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 16 (స్కై న్యూస్):** నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కేశంపేట సీఐ శ్రీనివాస్, షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులు ఎమ్మెల్యేకు మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా షాద్‌నగర్ పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని అధికారులను కోరారు.



## ఎల్నినో ఎఫెక్ట్ తో మార్కెట్లో సన్న బియ్యం ధరలకు రెక్కలు - సామాన్యుడిపై భారం

క్వింటాలుకు రూ.1000-1500 వరకు ధరల పెంపు

- కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపణలు

ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్



**ఆమనగల్లు, అక్టోబర్ 16(స్కై న్యూస్):** ఎల్నినో పేరుతో మార్కెట్లో సన్న బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. గత కొన్ని రోజులుగా సన్న బియ్యం ధరలు అమాంతం పెరగడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.వర్తకులు, హోల్ సేల్ వ్యాపారులు బియ్యం నిల్వల్లో కృత్రిమ కొరత సృష్టించి క్వింటాలుకు 1,000 నుంచి 1,500 రూపాయల వరకు ధరలు పెంచారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో రూ. 45-50 ఉన్న సన్న బియ్యం ధర ఇప్పుడు రూ. 60-65కు చేరిందని, కొన్ని చోట్ల ఇంకా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని వాపోతున్నారు.ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు దెబ్బతింటాయనే ప్రచారాన్ని అడ్డం పెట్టుకుని వ్యాపారులు ముందే ధరలు పెంచేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి కరవు ప్రభావం పూర్తిస్థాయిలో పంటలపై పడకముందే, మార్కెట్లోకి కొత్త పంట రాకముందే ఇలా ధరలు పెంచడం సరికాదని రైతులు, వినియోగదారులు అంటున్నారు.పేద, మధ్య తరగతి ప్రజలకు సన్న బియ్యం కొనడం భారంగా మారింది. రోజువారీ అవసరాలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మార్కెట్లో ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, నిత్యావసర సరుకుల నిల్వలపై నిఘా ఉంచి అక్రమ నిల్వలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.పౌర సరఫరాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి ధరలను అదుపు చేయకపోతే సామాన్యుడి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**: ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**పదేండ్ల సమస్యకు పరిష్కారం**

**310 కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై చట్టబద్ధమైన హక్కులు**





మహబూబ్ నగర్ పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రనమహబూబ్‌నగర్ పట్టణంలోని క్రిస్టియన్‌పల్లి, ఆదర్శనగర్ ప్రాంతాలకు చెందిన 310 మంది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు , అన్నపూర్ణ గార్డెన్స్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పేదలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 523 సర్వే నంబర్ పరిధిలో అనేక చిక్కుముడులు ఉన్నప్పటికీ, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించి 310 కుటుంబాలకు ఇళ్లపై చట్టబద్ధమైన హక్కులు కల్పించడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందించినప్పటికీ, సరైన గుర్తింపు పత్రాలు, చట్టబద్ధమైన ధ్రువపత్రాలు లేకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని తెలిపారు. ఇళ్లను వారసులకు బదిలీ చేసే విషయంలోనూ సమస్యలు తలెత్తాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు చిక్కుముడులు రాకుండా అన్ని అంశాలను పరిశీలించి, చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసిన తర్వాతే పట్టాలు పంపిణీ చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ పట్టాలు కేవలం కాగితాలు కావని, కుటుంబాలకు భద్రత కల్పించే చట్టబద్ధమైన హక్కులని అన్నారు. రాబోయే తరాలు కూడా తమ ఇంటిపై గర్వంగా హక్కు ప్రకటించుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే నాయకత్వానికి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు పనిచేసే నాయకత్వానికి ఎంతో తేడా ఉంటుందని, .మహబూబ్‌నగర్ నగరంలో గతంలో జరిగిన అక్రమాలు, ఆక్రమణలు, బెదిరింపులు, అక్రమ కేసులకు సంబంధించిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారాలు చూపడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. వేలాది మంది విద్యార్థులకు ఉపయోగపడేలా రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచే గ్రంథాలయాన్ని నిర్మించాలన్నది తమ లక్ష్యమని తెలిపారు. మహబూబ్‌నగర్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.70 కోట్లు మంజూరు చేయించామని, మొదటి దశలో రూ.20 కోట్లతో పనులు ప్రారంభించామని చెప్పారు. ఎంవీఎస్ జూనియర్ కళాశాల పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మిస్తున్నామని, సుమారు 2,000 మంది విద్యార్థులు నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునేలా ఆ విద్యాసంస్థను తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. గర్ల్స్ జూనియర్ కళాశాల కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నడిగడ్డలోని ఒకేషనల్ కళాశాల అభివృద్ధికి రూ.3 కోట్లు కేటాయించి ఆధునిక సదుపాయాలు కల్పించామని, పక్కనే ఉన్న జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి మరో రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఐటీఐల్లో ఆధునిక సాంకేతిక విద్య అందించేందుకు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న 10 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో రెండింటిని మహబూబ్‌నగర్‌కు తీసుకొచ్చామని సుమారు రూ.68 కోట్లతో ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేసి, టాటా గ్రూప్ సహకారంతో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో సుమారు 95 శాతం మందికి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను సాధించేందుకు విద్య, జ్ఞానం అత్యంత ముఖ్యమని ఎమ్మెల్యే అన్నారు. ఒక కుటుంబం విద్య ద్వారా అభివృద్ధి చెందితే, దానిని చూసి మరో వెయ్యి కుటుంబాలు స్ఫూర్తి పొందుతాయని పేర్కొన్నారు. పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, పారిశ్రామికవేత్తలుగా, ఇతర ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, భవిష్యత్తు తరాలు మెరుగైన జీవితాన్ని గడిపేలా ప్రోత్సహించాలని కోరారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం, కష్టాల్లో అండగా నిలవడం, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే నిజమైన రాజకీయమని అన్నారు. వచ్చే ఎన్నికల గురించి మాత్రమే కాకుండా, వచ్చే తరాల భవిష్యత్తు కోసం పనిచేసే నాయకులే చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నగర అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి, విద్యార్థుల భవిష్యత్తుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ ఖుష్బూ గుప్తా గారు మాట్లాడుతూ క్రిస్టియన్‌పల్లిలో గత తొమ్మిది, పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యను పరిష్కరించి, అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందించడం సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. తెలంగాణ ప్రభుత్వం హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించి అర్హులకు న్యాయం చేయాలని నిర్ణయించిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారి ప్రత్యేక చొరవతో జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇందులో భాగంగా క్రిస్టియన్‌పల్లిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించి, లబ్ధిదారులకు వారి ఇళ్లపై హక్కులు కల్పించగలిగామని పేర్కొన్నారు. లబ్ధిదారులకు అందజేసిన పట్టాలు వారి హక్కులకు నిదర్శనమని, ఇళ్లకు సంబంధించిన సమస్యలు పరిష్కారమై హక్కులు లభించడం ఆనందదాయకమని అన్నారు. లబ్ధిదారుల ముఖాల్లో కనిపిస్తున్న సంతోషం జిల్లా యంత్రాంగానికి సంతృప్తినిస్తోందని తెలిపారు. కుటుంబ సభ్యులందరూ ఈ ఆనందంతో బతుకమ్మ, దసరా పండుగలను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రిస్టియన్‌పల్లిలో ఇంకా ఏవైనా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటే జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పట్టాల పంపిణీ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ జి. మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సిజే బెనహర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు అజ్మత్ అలి, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, 10వ డివిజన్ కార్పొరేటర్ రమేష్, తో పాటు ఇతర కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వరి కోతల వరకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

**రైతులను కరువు నుంచి ఆదుకోవాలి.. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ జీవో 641 రద్దు చేయాలి**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య డిమాండ్**

**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 16 (స్కై న్యూస్):** వరి పంటలు కోతకు వచ్చే వరకు రైతులకు నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం షాద్‌నగర్ డివిజన్ సమితి పిలుపు మేరకు ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రాకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, కరువు నివారణ చర్యలు చేపట్టి పేదలకు కరువు భత్యం, నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే అవకాశం ఉందని పేర్కొంటూ సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌కు సంబంధించిన జీవో నంబర్ 641ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సర్వే పనులను వేగవంతం చేసి ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరారు. ఈ పథకం పూర్తయితే సాగునీరు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, మహిళలకు నెలకు రూ.2,500, నిరుద్యోగులకు భృతి, వికలాంగులకు రూ.6,000, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4,000 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి రూ.2.85 లక్షల కోట్లు కేటాయించి, రోజుకు రూ.800 కూలి చెల్లించడంతో పాటు ప్రతి కుటుంబానికి ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని కోరారు. ఓటర్ల జాబితా వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై విమర్శలు గుప్పిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ డిమాండ్లను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని జంగయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె. రాజు నాయక్, డివిజన్ కాలనీ అధ్యక్షుడు రమేష్ యాదవ్, కోశాధికారి రాములు గౌడ్, ఫరూఖ్‌నగర్ మండల నాయకులు నాగేష్, ఎం. రాములు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల ఆధ్వర్యంలో వంటా వార్పు...





**- 4వ రోజుకు చేరుకున్న రిలే దీక్షలు**

**నారాయణపేట అక్టోబర్ 16 (స్కైన్యూస్)** తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం టీజీ ఎన్.హెచ్.ఏం జేఏసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటితో నారాయణపేట జిల్లాలో నాల్గవ రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్క్ వద్ద ఎన్.హెచ్.ఏం ఉద్యోగులు వంటా వార్పు చేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

**ఎన్.హెచ్.ఏం నిరసనలకు పలు సంఘాల మద్దతు...**

ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల రిలే దీక్షలకు జిల్లా డిఎంఎచ్ఓ కార్యాలయము తరపున డాక్టర్ సాయిరాం, డాక్టర్ సత్య ప్రకాష్ రెడ్డి, జిల్లా ఆసుపత్రి ఉద్యోగ సంఘం తరపున డాక్టర్ బాలాజీ, సత్యనారాయణ, పిఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, టిఎన్జీఓ చైర్మెన్ నర్సింహ రెడ్డి, ఉపాధ్యక్షులు ఉదయ్ భాను, విజయ కుమార్, యూటీఎఫ్ అధ్యక్షులు బాలాజీ, భీమయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, కార్యదర్శి బలరాంలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఎన్.హెచ్.ఏం ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులు నేటికి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో అభద్రత మధ్య పనిచేయాల్సి వస్తోందన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు తప్పని సరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేడు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబాలను పోషించేందుకు అందుకు తగిన వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు బిక్షపతి, అధ్యక్షులు ప్రసాద్, కోశాధికారి రాఘవేందర్, ఎన్.హెచ్.ఎం యూనియన్ సభ్యులు డాక్టర్ నరసింహ రావు సగరి, శ్రీలత, వెంటరమణ, అనురాధ, తిరుపతి, కిరీటి, , విరోజ, చందన,శ్వేతశ్రీ, పుష్ప, సరస్వతి, డీడీఎం స్నేహలత, డిపిఎం మమత తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా బతకమ్మ సంబరాలు...



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 16( స్కై న్యూస్)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శాఖకు చెందిన ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తీరొక్క రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని కార్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళా ఉద్యోగులు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ వేడుకలు ఉద్యోగుల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పాయి.'తోడు బతుకమ్మ తొందరగా రావమ్మ.. మా తల్లి బతుకమ్మ మమ్మల్ని ఆదరించ రావమ్మ' అంటూ బతుకమ్మ పాటలతో కార్యాలయ ప్రాంగణం మార్మోగింది. పూల పండుగైన బతుకమ్మను భక్తిశ్రద్ధలతో కొలుస్తూ, ప్రకృతిని ఆరాధించే తెలంగాణ సంప్రదాయాన్ని ఉద్యోగులు ఘనంగా చాటిచెప్పారు. బతుకమ్మ, దసరా పండుగలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమని, ప్రజల్లో ఆనందోత్సాహాలను నింపే పండుగలని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాలు ఉద్యోగుల్లో నూతనోత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో డివిఏహెచ్ఓ డాక్టర్ బి. జ్ఞాన శేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) డాక్టర్ ఎస్.ఏ.ఎల్. నరసింహ, పశువైద్యులు డాక్టర్ కల్పన, డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ జీవిత, డాక్టర్ నవ్యశ్రీ, డాక్టర్ పల్లవి, డాక్టర్ ప్రణీతతో పాటు పశువైద్య సహాయకులు శ్రావణి, సల్మా, వనజ, లలిత, శైలజ, విజయలక్ష్మి, జ్యోతి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గౌతమ్‌పూర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు బిల్లులపై వివాదం

## ప్రజాధనం దుర్వినియోగంపై గ్రామస్థుల అనుమానాలు.. విచారణకు డిమాండ్

**చుంచుపల్లి అక్టోబర్ 16 భద్రాద్రి** కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం లోని గౌతమ్‌పూర్ గ్రామపంచాయతీ రోజురోజుకూ వివాదాలకు కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే గ్రామంలో కోతులు, కుక్కల బెడదను పరిష్కరించాలని కోరుతూ గ్రామసభను గ్రామస్థులు బహిష్కరించిన ఘటన చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా గ్రామపంచాయతీ పరిధిలోని కాలనీల్లో చెట్ల కొమ్మల తొలగింపు పనులకు సంబంధించిన బిల్లులపై కొత్త వివాదం తెరపైకి వచ్చింది.గ్రామంలోని వివిధ కాలనీల్లో చెట్ల కొమ్మల తొలగింపు పనుల పేరుతో సమర్పించిన బిల్లుల్లో అవకతవకలు జరిగాయనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. చేపట్టిన పనులకు, బిల్లుల్లో చూపించిన మొత్తాలకు మధ్య వ్యత్యాసం ఉందని,ఈ వ్యవహారంలో ప్రజాధనం దుర్వినియోగ మైందేమోనని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

**బిల్లులపై అధికారుల పర్యవేక్షణ ఏదీ?**

గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాల్సిన బాధ్యత ఉంది. అలాంటప్పుడు చెట్ల కొమ్మల తొలగింపు పనులకు సంబంధించిన బిల్లులు ఏ ప్రాతిపదికన రూపొందించారు? పనుల పరిమాణాన్ని, ఖర్చులను అధికారులు పరిశీలించారా? క్షేత్రస్థాయిలో పనులను తనిఖీ చేసిన తర్వాతే బిల్లులకు ఆమోదం తెలిపారా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.ఈ వ్యవహారంలో అధికారుల



పర్యవేక్షణలో లోపాలున్నాయా? బిల్లుల పరిశీలనలో నిర్లక్ష్యం జరిగిందా? అనే అంశాలపై కూడా సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. అయితే, అధికారుల ప్రమేయం లేదా అక్రమ చెల్లింపులు జరిగినట్లు ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు.

**బహిరంగ విచారణ జరపాలని డిమాండ్**

చెట్ల కొమ్మల తొలగింపు పనులకు సంబంధించిన బిల్లులు, పనుల వివరాలు, ఖర్చుల లెక్కలను బహిరంగంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని గౌతమ్‌పూర్ గ్రామస్థులు తదితరులు కోరుతున్నారు. గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై పారదర్శకత ఉండాలని, ప్రజాధనం దుర్వినియోగమైనట్లు విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో జరిగిన పనులను బిల్లులతో సరిపోల్చి, సంబంధిత అధికారుల పర్యవేక్షణను కూడా విచారణ పరిధిలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడిస్తారా? ఆరోపణలపై సమగ్ర విచారణ చేపడతారా? అన్నది వేచి చూడాలి. గౌతమ్ పూర్ పంచాయత్ సెక్రటరీ షర్మిల వివరణ కోరగా గౌతమ్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు పనుల్లో బిల్లుల విషయంలో అవకాతవకల్లు జరిగాయన్న విషయంపై గౌతంపూర్ గ్రామపంచాయతీ సెక్రటరీ షర్మిల వివరణ కోరగా ఆమె మాట్లాడుతూ తీర్మానంలో రాసింది 61000 రెండు రోజులు పనిచేశారు గత రెండు నెలల ముందు కూడా మిలీనియం కోటర్స్ లో చెట్లు తొలగింపు ముగ్గురు వ్యక్తులు రెండు రోజులు పనిచేసినందుకు 30000 రూపాయలు చెల్లించామని ఇవన్నీ తీర్మానం ప్రకారమే చేశాను నాదేముంది అని పంచాయతీ సెక్రటరీ తెలిపారు.మరి పంచాయితీ సెక్రటరీ కి తెలియకుండా నే జొరుగుతుందా అని అనుమానం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు. ఈప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా గ్రామస్థులు

# జూనియర్ సివిల్ జడ్జిగా ఆగిరి లక్ష్మీప్రసాద్ ఎంపిక

షాద్‌నగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం



**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 16 (స్కై న్యూస్):** కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామ మాజీ సర్పంచ్ ఆగిరి వెంకటేష్ కుమారుడు ఆగిరి లక్ష్మీప్రసాద్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంతో షాద్‌నగర్ ప్రాంతంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. తెలంగాణ హైకోర్టు ఇటీవల ప్రకటించిన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాల్లో ఆయన ఎంపికయ్యారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో లక్ష్మీప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాసులు గుప్తా ఆధ్వర్యంలో నాయకులు, సంఘ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మలిపెద్ది శ్రీనివాసులు గుప్తా మాట్లాడుతూ విద్య, మంచి నడవడికతో లక్ష్మీప్రసాద్ ఉన్నత స్థాయికి చేరుకోవడం అభినందనీయమన్నారు. న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి సమాజానికి సేవలందించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. లక్ష్మీప్రసాద్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం ఇన్ముల్‌నర్వ గ్రామంతో పాటు షాద్‌నగర్ ప్రాంతానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆగిరి రవికుమార్ గుప్తా, వెంకటేష్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో అన్నదానం

## అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు తనయుడు వనమా రాఘవేంద్రరావు పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు

**కొత్తగూడెం అక్టోబర్ 16( స్కై న్యూస్):** రామవరం 18వ డివిజన్ పరిధిలోని పంజాబ్ గడ్డ ఇందిరమ్మ కాలనీలో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మండపం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు తనయుడు వనమా రాఘవేంద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గమ్మ మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు, స్థానిక ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని చాటిచెప్పారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.అన్నదాన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల పాల్గొనడం దుర్గమ్మ మండపంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, కాంగ్రెస్ పార్టీ పాల్వంచ మండల అధ్యక్షుడు నూకల రంగారావు, రైల్వే బోర్డు మెంబర్ శ్రీనివాస్





రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ఉత్సవాల్లో భాగస్వాములయ్యారు. నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారాన్ని బలోపేతం చేస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధుల హాజరు అదేవిధంగా అన్నదాన కార్యక్రమంలో కార్పొరేటర్లు మునిగడప పద్మ, ఆకునూరి సుప్రియ, మాజీ కౌన్సిలర్ మునిగడప వెంకన్న, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్ పాల్గొన్నారు. దుర్గమ్మను దర్శించుకుని నవరాత్రి ఉత్సవాల్లో భాగస్వాములయ్యారు. భక్తులకు అన్నప్రసాదం అందించే కార్యక్రమంలో పాల్గొని ఉత్సవాల నిర్వహణను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రభ దినపత్రిక జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లక్ష్మణ్, విజన్ ఆంధ్రా దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు. పంజాబ్ గడ్డ ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తుల సందడితో కొనసాగుతుండగా, దుర్గమ్మ మండపం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమం ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అన్నదానం వంటి కార్యక్రమాలు నిరుపేదలకు ఆహారం అందించడంతో పాటు సమాజంలో మానవత్వం, సేవాభావాన్ని పెంపొందించేందుకు దోహదపడుతున్నాయి.

# కాత్యాయని మాతగా

**అమ్మ రాబాద్ స్కేన్ న్యూస్ శుక్రవారం అక్టోబర్ 16:**దేవి శరన్నవరాత్రులు సందర్భంగా ఆరవ రోజు కాత్యాయనీయమాతగా దర్శనమిస్తారు ఈరోజు ప్రసాదం అమ్మవారిని అలాగే ఆకుపచ్చ చీర అమ్మవారు కాత్యాయనీమ మహర్షి పూజ చేసి దేవుని ప్రసంగం చేసుకుంటాడు కాబట్టి ఈరోజు కాత్యాయనీ దేవి అని మరియు శుక్రవారము సరస్వతి మాతగా కొన్ని ప్రాంతాలలో ధనలక్ష్మి దేవిగా పూజలు సమర్పిస్తారు శు



క్రవారం రోజు పూజ చేసిన వారికి ధనం ప్రాప్తి లభిస్తుందని ఆలయ అర్చకుడు వీరయ్య శాస్త్రి గారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యురాలు శంభు శోభ కూడా పాల్గొంటు సహస్ర కుంకుమార్చన జరిపించారు ప్రతి సోమవారం పల్లకి సేవ పాప నాశనం వరకు పల్లకి సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారని పూజారి వీరే శాస్త్రి గారు తెలిపారు

# దసరా శరన్నవరాత్రుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీ జోగులాంబ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం పవిత్రమైన భాగ్యం

రాష్ట్ర ప్రజల సంక్షేమం,ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించే శక్తిని రాష్ట్ర ప్రభుత్వానికి కలగాలని జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు కోరిన మంత్రి వాకిటి శ్రీహరి



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 16(స్కై న్యూస్);**ఎల్‌నినో ప్రభావం నుంచి రైతాంగం,ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తొలగి,సమృద్ధిగా వర్షాలు కురిసి తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని జోగులాంబ అమ్మవారిని ప్రార్థించినట్లు రాష్ట్ర పశు సంవర్ధక,క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శుక్రవారం దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అలంపూర్‌లోని శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున కుటుంబసమేతంగా శ్రీ జోగులాంబ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ముందుగా శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు నిర్వహించడంతో పాటు విఘ్నేశ్వర స్వామికి అభిషేకం చేశారు.అనంతరం శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి,పట్టు వస్త్రాలు సమర్పించారు.అర్చకులు అమ్మవారి ప్రసాదం,శేషవస్త్రాన్ని అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ..శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివార్ల దసరా శరన్నవరాత్రుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం తనకు ఎంతో పుణ్యప్రదమైన అవకాశమని పేర్కొన్నారు.పేదలు,బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,రాష్ట్ర ప్రభుత్వానికి అమ్మవారు మరింత శక్తి,సామర్థ్యాలను ప్రసాదించాలని కోరుకున్నట్లు తెలిపారు.ఎల్‌నినో ప్రభావాలు తగ్గి,రాష్ట్రంలో అనుకూల వాతావరణ పరిస్థితులు నెలకొని,సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని శ్రీ జోగులాంబ అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.రైతాంగం మంచి దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, వ్యవసాయ రంగం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రకృతి ప్రతికూల ప్రభావాల నుంచి ఉపశమనం పొందాలని అమ్మవారి ఆశీస్సులు కోరినట్లు పేర్కొన్నారు.రాష్ట్రం సస్యశ్యామలంగా మారి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, రాష్ట్ర గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సరిత,ఆలయ ఈవో దీప్తి,స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలి...

**-- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను**

**నారాయణపేట అక్టోబర్ 16( స్కైన్యూస్)** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, రహదారులపై ప్రజలకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం, అత్యవసర వైద్య సేవల మెరుగుదలపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో రోడ్ సేఫ్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ.. జిల్లాలో మున్సిపల్ పరిధిలోని రహదారులపై విస్తరించిన చెట్ల కొమ్మలను తొలగించి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. రహదారులపై అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సూచికలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణను పటిష్టం చేయడంతో పాటు, నో-పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల నిలుపుదలను నియంత్రించాలన్నారు. బస్టాండ్‌లు, బస్‌స్టాప్‌లు లేని ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా లోని మెడికల్ కాలేజీ ప్రవేశ మార్గాల్లో చెట్ల కొమ్మలు, ఇతర అడ్డంకులు లేకుండా చూడాలని, అంబులెన్సుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులపై ప్రమాదాలు సంభవించే ప్రాంతాలను గుర్తించి తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో నో-హార్న్ జోన్‌లు, నో-స్మోకింగ్ జోన్‌లు తదితర భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత శాఖలకు సూచించారు.రోడ్డు





ప్రమాద బాధితులకు సకాలంలో అత్యవసర వైద్య సహాయం అందేలా అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచాలని, ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్సా సదుపాయాలను సమీక్షించాలని సూచించారు. పీఎం రాహాట్ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలపై సంబంధిత అధికారులు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు, ప్రమాద బాధితులకు అందించే చికిత్స, అంబులెన్స్ సేవల లభ్యతపై సంబంధిత వైద్యాధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.రోడ్డు భద్రతకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు, రోడ్లు మరియు భవనాల శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కాగా సమావేశ ప్రారంభంలో ఆర్ అండ్ బీ ఈ ఈ వెంకట రమణయ్య గత సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ అండ్ బీ, ఆర్టీవో, పోలీసు, మున్సిపల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చూపించారు. ఆయా బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణ కు అవసరమైన చర్యలు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, ఆర్టీవో మెంబర్ పోషల్ రాజేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంపత్ కుమార్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ మల్లికార్జున్,ఆర్టీవో మున్నీ, పీ ఆర్ ఈ ఈ అశోక్ కుమార్, డీ ఈ ఓ గోవింద రాజులు, ఆర్టీసీ డిపో మేనేజర్ యాకన్న, ఆర్ అండ్ బీ ఏ.ఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బిజినెస్

## మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో మాడల్

**ప్రారంభ ధర రూ.9.99 లక్షలు**




**ముంబై, అక్టోబర్ 15 :** ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా సరికొత్త మాడల్‌ను పరిచయం చేసింది. ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో జెడ్‌ఎన్‌జీ పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ రూ.9.99 లక్షల నుంచి రూ.12.27 లక్షల మధ్యలో ధరను నిర్ణయించింది. సీఎన్‌జీ, పెట్రోల్ ఇంజిన్‌తో తయారు చేసింది. కేవలం 4.9 సెకండ్లలో 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు అడ్వాన్స్‌డ్ సీఎన్‌జీ టెక్నాలజీ కలిగిన ఈ మాడల్ కిలోకు 24.7 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. భద్రతా ప్రమాణాలు పాటించడంలో భాగంగా ఫైవ్ స్టార్ రేటింగ్, 35 స్టాండర్డ్ ఫీచర్లు ఉన్నాయి. వీటిలో 26 సెంటీమీటర్ల హెచ్‌డీ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో కార్‌ప్లే, రియర్ వ్యూ కెమెరా, క్రూజ్ కంట్రోల్, టైప్ సీ చార్జర్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్ వంటి ఫీచర్లతో తీర్చిదిద్దింది.

## మెరిసిన బ్యాంకింగ్, ఐటీ షేర్లు

**సెన్సెక్స్ 1,534, నిఫ్టీ 375 పాయింట్లు వృద్ధి**



**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. బ్యాంకులు, ఐటీ రంగ షేర్లతోపాటు బ్లూచిప్ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లకు మదుపర్ల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలు మద్దతు లభించింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 1,533.72 పాయింట్లు లేదా 2.11 శాతం పుంజుకుని 74,315.61 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 1,548.40 పాయింట్లు ఎగబాకింది. ఇక నిఫ్టీ కూడా 374.65 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి 22,997.35 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పరుగులు పెడుతున్న ముడి చమురు ధరలకు బ్రేకులు పడటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ రేటు 2.34 శాతం పడిపోయి 103.60 డాలర్లకు దిగొచ్చింది. అలాగే ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ గతకొద్ది రోజులుగా పెరుగుతుండటం కూడా కలిసొచ్చింది. ఇక కృత్రిమ మేధస్సు విలువలు అతిగా పెరుగుతున్న నేపథ్యంలో సెంట్రల్ బ్యాంకులు, రెగ్యులేటర్లు, మార్కెట్ భాగస్వాములు దిద్దుబాటుకు అవకాశాలున్నాయని హెచ్చరించడం.. భారతీయ ఈక్విటీల్లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహానికి దోహదం చేసినట్టు తాజా సరళిని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతేగాక అమెరికాలో అధిక ద్రవ్యోల్బణం, కఠిన ద్రవ్య విధానం, బాండ్ల రాబడుల్లో క్షీణత కూడా ఇన్వెస్టర్లను స్టాక్స్ వైపునకు మొగ్గు చూపేలా చేశాయని వారు అంటున్నారు.

# రియల్ ఎస్టేట్‌లోకి మరో బడా కంపెనీ




రియల్ ఎస్టేట్, స్థలాల అభివృద్ధి, ఇతర అనుబంధ వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ (జీఏఎల్) అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఏరో రియల్టీ (జీఏఆర్‌ఎల్) పేరిట అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. అక్టోబర్ 13న ఏర్పాటైన ఈ సంస్థకు రూ.1 కోటి పెయిడప్ షేర్ క్యాపిటల్ ఉంది. రూ.10 ముఖ విలువ కలిగిన 10 లక్షల ఈక్విటీ షేర్లతో సంస్థను ఏర్పాటు చేశారు. అయితే, కొత్త సంస్థ ఇంకా కార్యకలాపాలను ప్రారంభించలేదు. రియల్ ఎస్టేట్, భూముల అభివృద్ధి, ఇతర సంబంధిత వ్యాపార అవకాశాలను అన్వేషించడం దీని ప్రధాన లక్ష్యంగా ఉండనుంది.

మరోవైపు, విమానాశ్రయాల ద్వారా సరుకు రవాణా సేవలను మరింత విస్తరించే లక్ష్యంతో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, అంతర్జాతీయ లాజిస్టిక్స్ సంస్థ అరామెక్స్ చేతులు కలిపాయి. జీఎంఆర్ నిర్వహణలోని విమానాశ్రయాల్లో అరామెక్స్ కార్యకలాపాలను బలోపేతం చేయడం, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్‌ఎంఈ) అంతర్జాతీయ సరుకు రవాణాకు మద్దతు ఇవ్వడం ఈ ఒప్పందం ఉద్దేశం. ఎక్స్‌ప్రెస్ కార్గో టెర్మినల్ల వద్ద ప్రత్యేక ట్రక్కు డాక్స్, సరుకు తనిఖీ వ్యవస్థలు, కార్గో నిర్వహణకు అవసరమైన స్థలాన్ని అభివృద్ధి చేసే అవకాశాలను ఇరు సంస్థలు పరిశీలించనున్నాయి. టెర్మినల్‌కు సమీపంలో విమానాశ్రయం వైపు నేరుగా చేరుకునే ప్రత్యేక మార్గంతో గిడ్డంగిని ఏర్పాటు చేసే అంశంపైనా చర్చించనున్నాయి. అయితే, ఈ ప్రతిపాదనల అమలు తుది ఒప్పందాలు, పెట్టుబడులు, ప్రాజెక్టు కాలపరిమితులపై ఆధారపడి ఉంటుంది.

ఈ వ్యూహాత్మక విస్తరణకు జీఎంఆర్ గ్రూప్ ఇప్పటికే అభివృద్ధి చేసిన విమానాశ్రయ మౌలిక సదుపాయాలు కీలకంగా మారనున్నాయి. సంస్థ అధికారిక సమాచారం ప్రకారం, 2025--26 ఆర్థిక సంవత్సరంలో జీఎంఆర్ విమానాశ్రయాల ద్వారా 1.3 మిలియన్ టన్నులకు పైగా సరుకు రవాణా జరిగింది. ఢిల్లీ, హైదరాబాద్, గోవా విమానాశ్రయాల్లో కార్గో సదుపాయాలు ఉండటంతో పాటు, హైదరాబాద్ కేంద్రం ఔషధాల ఎగుమతులకు ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉంది. విమానాశ్రయాల చుట్టూ భూముల అభివృద్ధి, గిడ్డంగులు, కార్గో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టడం ద్వారా విమానయానేతర ఆదాయ మార్గాలను విస్తరించుకునే అవకాశం సంస్థకు లభించవచ్చు. అయితే, కొత్త రియల్టీ అనుబంధ సంస్థ చేపట్టబోయే నిర్దిష్ట ప్రాజెక్టులపై ఇంకా వివరాలు వెల్లడించలేదు.

# ఒక టీవీ కొంటే మరో టీవీ ఫ్రీ..

# టాప్ కంపెనీ 'బిగ్' ఆఫర్!

దీపావళి పండుగ వేళ పెద్ద స్క్రీన్ టీవీ కొనాలనుకునే వినియోగదారులకు శాంసంగ్ ఇండియా అదిరిపోయే ఆఫర్లను ప్రకటించింది. 'బిగ్, బిగ్గర్, బిగ్గెస్ట్' పేరుతో ప్రత్యేక పండుగ ప్రచారాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన మోడళ్లను కొనుగోలు చేసేవారికి మరో విజన్ ఏఐ టీవీని లేదా సౌండ్‌బార్‌ను ఉచితంగా అందించనుంది. వీటితోపాటు క్యాష్‌బ్యాక్, ఈఎంఐ సదుపాయాలు, ఎక్స్‌టెండెడ్ వారంటీ వంటి ప్రయోజనాలను ప్రకటించింది.

**రూ.1.59 లక్షల విలువైన టీవీ ఉచితం!**

ఈ ప్రచారంలో భాగంగా అర్హత కలిగిన శాంసంగ్ టీవీ మోడల్‌ను కొనుగోలు చేస్తే.. గరిష్ఠంగా రూ.1,59,990 విలువైన మరో విజన్ ఏఐ టీవీని ఉచితంగా పొందవచ్చు. లేదంటే రూ.1,10,990 వరకు విలువైన శాంసంగ్ సౌండ్‌బార్‌ను ఎంచుకోవచ్చు. అయితే, ఈ రెండింటిలో ఏదో ఒక ప్రయోజనాన్ని మాత్రమే పొందగలరు. ఏ టీవీ మోడల్‌ను కొనుగోలు చేశారనే దానిపై ఉచితంగా లభించే ఉత్పత్తి, దాని



విలువ ఆధారపడి ఉంటాయి.

**20 శాతం వరకు క్యాష్‌బ్యాక్**

ఉచిత ఉత్పత్తులతోపాటు విజన్ ఏఐ టీవీలపై గరిష్ఠంగా 20 శాతం వరకు క్యాష్‌బ్యాక్ అందిస్తున్నట్లు శాంసంగ్ తెలిపింది. ఒకేసారి పూర్తి మొత్తాన్ని చెల్లించలేని వినియోగదారుల కోసం జీరో డౌన్‌పేమెంట్ ప్లాన్లను కూడా అందుబాటులోకి తెచ్చింది. అంతేకాకుండా మూడేళ్ల సమగ్ర వారంటీ ప్రయోజనాన్ని ప్రకటించింది. అయితే, ఈ ఆఫర్లకు వర్తించే అర్హతలు, నిబంధనలను కొనుగోలుదారులు ముందుగా తెలుసుకోవాలి.

**ఉచిత స్ట్రీమింగ్ ఛానెల్స్..**

'మేడ్ ఫర్ ఇండియా' ప్లస్ ప్రయోజనాల్లో భాగంగా శాంసంగ్ పలు అదనపు సదుపాయాలను అందిస్తోంది. శాంసంగ్ ఆర్ట్ ప్లస్ ద్వారా ఆర్ట్ స్టోర్‌కు మూడు నెలల ఉచిత యాక్సెస్ లభిస్తుంది. శాంసంగ్ టీవీ ప్లస్‌లో 200కు పైగా స్ట్రీమింగ్ ఛానెల్స్‌ను ఉచితంగా వీక్షించవచ్చు. శాంసంగ్ ఫైనాన్స్ ప్లస్ ద్వారా పేపర్‌లెస్ ఫైనాన్సింగ్ సదుపాయం పొందవచ్చు. శాంసంగ్ కేర్ ప్లస్ పొడిగించిన వారంటీ కవరేజీని అందించగా.. శాంసంగ్ సౌండ్ ప్లస్ మెరుగైన ఆడియో అనుభవంపై దృష్టి పెడుతుంది.

# టీమిండియా స్టార్ ఓపెనర్ సంచలన నిర్ణయం..

# 17 ఏళ్ల కెరీర్‌కు గుడ్‌బై

భారత మహిళా క్రికెట్ జట్టు సీనియర్ బ్యాటర్ పూనమ్ రౌత్ సంచలన నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌కు పూనమ్ రిటైర్మెంట్ ప్రకటించింది. 17 ఏళ్ల అద్భుత ప్రయాణానికి తెరదించుతూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె తన నిర్ణయాన్ని వెల్లడించింది. దేశం తరఫున అత్యున్నత స్థాయిలో ప్రాతినిధ్యం వహించడం తనకు దక్కిన అరుదైన గౌరవమని ఆమె పేర్కొంది. తన ఈ సుదీర్ఘ ప్రయాణంలో మద్దతుగా నిలిచిని ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని తన రిటైర్మెంట్ నోట్‌లో ఆమె రాసుకొచ్చింది. 2009లో అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగు పెట్టిన పూనమ్.. తన కెరీర్‌లో 112 మ్యాచ్‌లు ఆడింది. 37 ఏళ్ల పూనమ్ రౌత్ మూడు ఫార్మాట్లలో కలిపి మూడు వేలకు పైగా పరుగులు సాధించింది. ముఖ్యంగా 2017 ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్‌లో ఆమె అద్భుతమైన ప్రదర్శన చేసింది. ఈ టోర్నీలో మొత్తం ఆమె 381 పరుగులు పరుగులు చేసింది. లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కూడా 86 పరుగుల అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. ఆమె చివరిసారిగా 2021లో ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో భారత్ తరఫున బరిలోకి దిగింది.

**క్రీడాస్ఫూర్తికి ప్రతీక**

2021లో ఆస్ట్రేలియాతో జరిగిన చారిత్రాత్మక పింక్-బాల్ టెస్ట్ మ్యాచ్‌లో ఆమె క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి అందరి



ప్రశంసలు అందుకుంది. బంతి బ్యాట్‌ను తాకినా అంపైర్ నాటౌట్ ప్రకటించినప్పటికీ, తాను ఔట్ అయ్యానని భావించి ఆమె స్వయంగా మైదానం వీడి వెళ్లిపోయింది. దీంతో ప్రత్యర్థి జట్టు ప్లేయర్లు సైతం ఆమె నిజాయితీకి ఫిదా అయిపోయారు. కాగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన పూనమ్ ఇక కోచ్‌గా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశముంది.

# రుతురాజ్ రీఎంట్రీ




రంజీ ట్రోఫీ 2026-27 సీజన్‌లో రెండో రౌండ్ మ్యాచ్‌కు మహారాష్ట్ర జట్టును ప్రకటించారు. స్టార్ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ తిరిగి జట్టులోకి వచ్చాడు. రెగ్యులర్ కెప్టెన్ అయిన రుతురాజ్ జట్టులోకి వచ్చినా కెప్టెన్సీ బాధ్యతలను మాత్రం పృథ్వీ షాకే అప్పగించారు. సర్వీసెస్‌తో జరిగిన తొలి మ్యాచ్‌కు రుతురాజ్ అందుబాటులో లేని (భారత-ఏ జట్టుకు ప్రాతినిధ్యం) నేపథ్యంలో షాకు తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. ఆ మ్యాచ్‌లో సర్వీసెస్‌పై మహారాష్ట్ర 127 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో షా కెప్టెన్‌గానే కాకుండా ఆటగాడిగానూ రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

మరింత పటిష్టంగా మారిన మహారాష్ట్ర బ్యాటింగ్

రుతురాజ్ రాకతో మహారాష్ట్ర బ్యాటింగ్ విభాగానికి మరింత బలం చేకూరింది. ఇప్పటికే పృథ్వీ షా, దివిజయ్ పాటిల్, అంకిత్ బావ్నే, హర్షల్ కాటే, సిద్ధేశ్ వీర్, ముకేశ్ చౌదరి, రాజవర్ధన్ హంగర్గేకర్, విక్కీ ఓత్స్వాల్, సౌరభ్ నవలే తదితరు బ్యాటర్లు జట్టులో కొనసాగుతున్నారు. మహారాష్ట్ర-ఝార్ఖండ్ మ్యాచ్ అక్టోబర్ 18 నుంచి 26 వరకు పుణేలో జరగనుంది.

# స్పోర్ట్స్

## ఆఫ్ఘన్ ప్లేయర్‌పై ఐసీసీ చర్యలు



ఆఫ్ఘనిస్తాన్ వికెట్ కీపర్ బ్యాటర్ అఫ్సర్ జజాయ్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. బంగ్లాదేశ్‌తో అబుదాబిలో జరిగిన ఏకైక టెస్టు సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించినందుకు అతడిని అధికారికంగా మందలించింది. అతడి క్రమశిక్షణ రికార్డులో ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చింది. బంగ్లాతో మ్యాచ్‌లో అఫ్సర్ ఆఫ్ఘన్ జట్టుకు 12వ ఆటగాడిగా వ్యవహరించాడు. ఈ సమయంలో మైదానంలోకి రావద్దని, ఆట ఆలస్యమయ్యేలా చేయవద్దని అంపైర్లు పలుమార్లు సూచించినా అతడు పట్టించుకోలేదు. ఓ దశలో అంపైర్ల అనుమతి లేకుండా మైదానంలోకి ప్రవేశించాడు. దీంతో అంపైర్ అతడిపై ఐసీసీకి ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ఐసీసీ అఫ్సర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. అంతర్జాతీయ మ్యాచ్‌లో అంపైర్ ఆదేశాలను పాటించకపోవడం ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.4 ఉల్లంఘన కిందికి వస్తుంది.

**అఫ్సర్ జజాయ్ ఎవరు..?**

అఫ్సర్ జజాయ్ కుడిచేతి వాటం వికెట్ కీపర్ బ్యాటర్. ఆఫ్ఘనిస్తాన్ తరఫున మూడు ఫార్మాట్లలోనూ ప్రాతినిధ్యం వహించాడు. 2018 జూన్‌లో భారత్‌తో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లోనూ అతడు పాల్గొన్నాడు. 16 ఏళ్ల వయసులో ఆఫ్ఘన్ అండర్-19 జట్టులో చోటు దక్కించుకున్న జజాయ్.. 2010, 2012 అండర్-19 ప్రపంచకప్‌లలోనూ ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటివరకు 10 టెస్టులు ఆడిన జజాయ్ 378 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ ఉంది. 17 వన్డేల్లో 264 పరుగులు, ఎనిమిది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 141 పరుగులు సాధించాడు. ఇదిలా ఉంటే, అబుదాబీ వేదికగా ఆఫ్ఘనిస్తాన్-బంగ్లాదేశ్ మధ్య జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆఫ్ఘన్ ప్లేయర్లు అద్భుతంగా పోరాడి ఓటమి తప్పించుకున్నారు. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 346, 372-7 స్కోర్లు చేయగా.. ఆఫ్ఘనిస్తాన్ 240 మరియు 346-8 స్కోర్లు చేసింది.



# పులి నేపథ్యంలో సాగే కథతో?

మెగా హీరో సాయిదుర్గతేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటి గట్టు' సినిమా చేస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానున్నది. ఈ సినిమా తర్వాత 'సేవ్ ది టైగర్స్'ఫేం తేజ కాకుమాను దర్శకత్వంలో సాయిదుర్గతేజ్ ఓ సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఇటీవలే క్లాప్ కొట్టారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలు కానున్నది. 'కాంతార'ఫేం సప్తమి గౌడ ఈ సినిమాలో కథానాయికగా ఖరారైంది. ఇదిలావుంటే.. ఈ సినిమా కథాంశం విషయంలో ఓ ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. అటవీ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో పులి పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందట. అందుకే.. పులికి సంబంధించిన సన్నివేశాలను ప్రీ విజువలైజేషన్ చేశారట. భారీ స్థాయిలో సీజీ వర్క్ అవసరమైన సినిమా ఇదని సమాచారం. ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసిన తర్వాతే సెట్స్ పైకి వెళ్లాలని దర్శకుడు తేజ కాకుమాను ఫిక్స్ అయ్యారట. ఈ నెలాఖరునే తొలి షెడ్యూల్ మొదలవుతుందని తెలిసింది. తమన్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.



## మూవీ లవర్స్‌కు గుడ్ న్యూస్..

# వైజాగ్‌లో చిరంజీవి నయా ప్లాన్..!

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. విశ్వంభర, కాకా సినిమాతోపాటు శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో ఓ సినిమా చేస్తున్నాడు. కాగా చిరుకు సంబంధించిన ఆసక్తికర వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. త్వరలోనే చిరంజీవి ఫిల్మ్ ఎగ్జిబిషన్ బిజినెస్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు. ఏసియన్ సినిమాస్‌తో కలిసి హైదరాబాద్‌కు ఔశీతీశ్రీస'ం ఝుతీస్త్రవర్ గాఱతీవవఅ (ప్రపంచ అతిపెద్ద థియేటర్)ను తీసుకురాబోతున్నాడు. అంతేకాదు ఏపీలోని విశాఖపట్నం కొత్త మల్టీ స్క్రీన్ థియేటర్‌ను నిర్మించాలనే ప్లాన్ కూడా చేస్తున్నాడట. గరివిడి లక్ష్మి మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఏపీ మంత్రి గంటా శ్రీనివాస్ రావు ఈ వార్తను షేర్ చేశారు. చిరంజీవితో గంటా శ్రీనివాస్ రావుకు మంచి అనుబంధం ఉందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇటీవలే గంటా శ్రీనివాస రావు చిరంజీవిని కలవగా.. వైజాగ్‌లో న్యూ మల్టీప్లెక్స్ థియేటర్ విషయం తెరపైకి వచ్చింది. చిరంజీవికి కెరీర్ తొలినాళ్ల నుంచి వైజాగ్‌తో చాలా అటాచ్‌మెంట్ ఉందని తెలిసిందే. ఈ నేపథ్యంలో వైజాగ్‌లో మల్టీప్లెక్స్ నిర్మించేందుకు ప్లాన్ చేయడం అక్కడి అభిమానులకు శుభవార్తే అని చెప్పాలి.

# ముగ్గురు హీరోయిన్లతో.. సందీప్ కిషన్



హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం 'కరికాల' ఘనంగా ప్రారంభమైంది. యుగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్నారు. భారీ ఊహా ప్రపంచం నేపథ్యంలో రెండు భాగాలుగా రూపొందనున్న ఈ సినిమాలో కేథరిన్ థ్రెసా, గాయత్రి భరద్వాజ్, సాక్షి మడోల్కర్ కథానాయికలుగా నటిస్తున్నారు. గురువారం నిర్వహించిన పూజా కార్యక్రమంతో ఈ సినిమా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు ఆది సాయి కుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. వచ్చే వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు.

**కెరీర్‌లోనే ఉత్తమ చిత్రంగా..**

ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ.. 'కరికాల' కథను రెండు భాగాలుగా చెప్పినా ఎక్కడా బోర్ అనిపించలేదని తెలిపారు. గత ఆరు, ఏడు నెలలుగా దర్శకుడు యుగంధర్ ముని ప్రీ ప్రొడక్షన్ కోసం ఎంతో కష్టపడుతున్నారని ప్రశంసించారు. ఈ చిత్రం తన కెరీర్‌లోనే ఉత్తమ చిత్రంగా నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీచరణ్ పాకాల అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు.

**తేదీలు ఖరారు**

'కరికాల' చిత్రాన్ని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మేకర్స్ గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తొలి భాగం 2027 జూలై 2న, రెండో భాగం అదే ఏడాది అక్టోబర్ 28న విడుదల కానుంది. సందీప్ కిషన్ కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందని భావిస్తున్న ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు నటిస్తుండటం, నాగలోకం, వానర లోకం వంటి విభిన్న నేపథ్యాలు ఉండటం ఆసక్తిని పెంచుతున్నాయి.

# పెళ్లికి ఇంకా టైముంది!



గత కొన్నేళ్లుగా సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటున్నది మలయాళీ సోయగం అనుపమ పరమేశ్వరన్. మహిళా ప్రధాన చిత్రాలతో పాటు ప్రధానస్రవంతి చిత్రాల్లో కథానాయికగా రాణిస్తూ సత్తా చాటుతున్నది. తాజాగా ఈ భామ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'తో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నది. తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, వీకే నరేష్ ప్రధాన పాత్రల్లో భద్రప్ప గాజుల దర్శకత్వంలో బూసం జగన్‌మోహన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం అనుపమ పరమేశ్వరన్ విలేకరులతో సినిమా సంగతుల్ని పంచుకుంది. ఈ సినిమాలో తాను స్వతంత్ర్య భావాలు కలిగిన కీర్తి అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తన నిజ జీవితానికి దగ్గరగా ఉండే పాత్ర ఇదని పేర్కొన్నది. ఆమె మాట్లాడుతూ 'తెలంగాణ పెళ్లి నేపథ్యంలో ఆద్యంతం వినోదప్రధానంగా సాగే చిత్రమిది. మా కేరళ వివాహ వేడుకల్లో పూర్తిగా శాకాహారమే వడ్డిస్తారు. కానీ తెలంగాణ పెళ్లిలో నాన్‌వెజ్ పెడతారని ఈ సినిమా ద్వారానే తెలుసుకున్నా. ఈ కథలో పాత్రలన్నీ స్ట్రగుల్ పడుతుంటాయి. కానీ వాళ్ల కష్టాల నుంచే మంచి కామెడీ పుడుతుంది' అని చెప్పింది. పెళ్లెప్పుడు చేసుకుంటారనే ప్రశ్నకు జవాబిస్తూ 'నా పెళ్లి విషయంలో మా పెరెంట్స్ నుంచి ఎలాంటి ఒత్తిడిలేదు. ఇష్టమైనప్పుడు చేసుకో అంటున్నారు. నా పెళ్లికి ఇంకా టైముంది అనుకుంటున్నా' అని చెప్పింది. 'క్రేజీ కల్యాణం'లోని కీర్తి పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుందని, ప్రస్తుతం తమిళ, మలయాళ భాషల్లో వరుస సినిమాలు చేస్తున్నానని, అవన్నీ వేటికవే విభిన్నమైన పాత్రలని అనుపమ పరమేశ్వరన్ చెప్పింది.

# దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు.. 12 కొత్త హాల్టులు

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. కనెక్టివిటీని మెరుగుపరిచే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా 4 కొత్త రైలు సర్వీసులను ప్రారంభించేందుకు, ఇప్పటికే నడుస్తున్న 3 రైళ్లను పొడిగించేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. వీటితో పాటు, ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఆధారంగా 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్లను కేటాయించింది. ఈ మార్పులకు సంబంధించిన రైళ్ల ప్రారంభ తేదీలు, పొడిగింపు తేదీలను సంబంధిత రైల్వే జోన్లు త్వరలో వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా వెల్లడిస్తాయని అధికారులు తెలిపారు.



**కొత్తగా ఆమోదం పొందిన రైళ్లు:**

1. రాయ్‌పూర్ -- రౌఘాట్ మెమూ (68768/68769): ఈ రైలు శనివారం మినహా వారానికి 6 రోజులు నడుస్తుంది.
రౌఘాట్ నుంచి ఉదయం 6:30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1:05 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుంది.
రాయ్‌పూర్ నుంచి మధ్యాహ్నం 1:20 గంటలకు బయలుదేరి రాత్రి 7:00 గంటలకు రౌఘాట్ వెళుతుంది.

2. హరిద్వార్ -- వెరావల్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (14326/14325): ఇది వారానికి రెండుసార్లు నడిచే సర్వీస్.
ఈ రైలు హరిద్వార్ నుంచి బుధ, ఆదివారాల్లో; వెరావల్ నుంచి గురు, సోమవారాల్లో నడుస్తుంది.
హాల్టులు: రూర్కీ, ముజఫర్‌నగర్, మీరట్ సిటీ, ఘజియాబాద్, ఢిల్లీ, రేవారి, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, పాలన్‌పూర్, రాజ్‌కోట్, జునాగఢ్ వంటి ప్రధాన స్టేషన్లలో ఆగుతుంది.

3. హరిద్వార్ -- ఓఖా ఏసీ ఎక్స్‌ప్రెస్ (14328/14327): ఇది వారానికి ఒకసారి నడిచే సర్వీస్.
హరిద్వార్ నుంచి శుక్రవారం, ఓఖా నుంచి శనివారం బయలుదేరుతుంది.
హాల్టులు: రూర్కీ, మీరట్ సిటీ, ఢిల్లీ, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, రాజ్‌కోట్, జామ్‌నగర్, ద్వారకలలో ఆగుతుంది.

4. బీర్ -- ఇటార్సీ ప్యాసింజర్ (51689/51690): వారానికి ఒకసారి నడుస్తుంది.
బీర్ నుంచి శనివారం, ఇటార్సీ నుంచి ఆదివారం అందుబాటులో ఉంటుంది.

పొడిగించిన సర్వీసులు:

1. బాంద్రా (ట) -- ఢిల్లీ సరాయ్ రోహిల్లా గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12216/12215): ఈ రైలును హరిద్వార్ వరకు పొడిగించారు. పొడిగింపు మార్గంలో ఢిల్లీ, ఘజియాబాద్, మీరట్ సిటీ, ముజఫర్‌నగర్, రూర్కీలలో అదనపు స్టాపులు ఉంటాయి.
2. గోండియా -- వాడ్సా మెమూ (68806): ఈ రైలును అర్మోరి వరకు పొడిగించారు.
3. వాడ్సా -- చందా ఫోర్ట్ మెమూ (68808): ఈ రైలును కూడా అర్మోరి వరకు పొడిగించారు.

**కొత్తగా కేటాయించిన హాల్టులు:**

కింది 12 రైళ్లకు కొత్తగా హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.
వల్సాడ్--వడనగర్ ఎక్స్‌ప్రెస్ (20959/20960): అంకలేశ్వర్
హతియా--హౌరా క్రియ యోగా ఎక్స్‌ప్రెస్ (18616): చకులియా
సహర్సా--అమృత్‌సర్ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12203/12204): పానిపట్
హైదరాబాద్--రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17005/17006): రిగా
దర్భంగా--గోమతి నగర్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (15561/15562): రిగా
తిరుపతి--రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17433/17434): బైరగ్నియా
లౌకహా బజార్--ఆనంద్ విహార్ టెర్మినల్ స్పెషల్ (04013/04014): ఘోరసహన్
బాంద్రా (ట)--జైపూర్ ఎక్స్‌ప్రెస్ (22933/22934): నవ్‌సారి
అలప్పుజ--కన్నూర్ ఎక్స్‌ప్రెస్ (16307): వల్లిక్కున్ను
ఖు= బెంగళూరు--ఎర్నాకులం జంక్షన్ ఎక్స్‌ప్రెస్ (16377/16378): ఒట్టపాలెం
లోకమాన్య తిలక్ టెర్మినస్--పాట్లీపుత్ర ఎక్స్‌ప్రెస్ (12141/12142): గహ్మర్
సీల్దా--రాంపూర్‌హట్ ఎక్స్‌ప్రెస్ (13187/13188): బారక్‌పూర్

ఈ కొత్త సర్వీసులు, పొడిగింపులు, అదనపు హాల్టుల వల్ల పలు ప్రాంతాల మధ్య ప్రయాణ సౌకర్యం గణనీయంగా మెరుగుపడుతుందని, ప్రయాణికుల సమయం ఆదా అవుతుందని రైల్వే శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

# మనం చేసి చూపిద్దాం

భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా "మనం చేసి చూపిద్దాం" అనే కొత్త నినాదంతో వారిలో స్ఫూర్తిని నింపారు. దేశంలో క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, అథ్లెట్లకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.



పతక విజేతలతో భేటీ కావడం అద్భుతమైన సందర్భమని అభివర్ణించిన ప్రధాని, క్రీడాకారుల అంకితభావాన్ని, వారు సాధించిన విజయాలను కొనియాడారు. "మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటిచెప్పడమే మీరు సాధించిన అతిపెద్ద విజయం. లక్ష్యం పట్ల ఉన్న అభిరుచి విజయంగా రూపాంతరం చెందినప్పుడు, పతకాలతో పాటు ఆ క్రీడాకారుల ముఖాల్లో కనిపించే వర్చస్సు మీ అందరిలోనూ ప్రతిబింబిస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ఈ ఘనత కేవలం క్రీడాకారులదే కాదని, దీని వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యులతో పాటు కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే తరుణంలో, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

**చారిత్రక విజయాలపై ప్రశంసలు**

ఈసారి ఆసియా క్రీడలు భారత్‌కు ఎన్నో మైలురాళ్లను మిగిల్చాయని ప్రధాని గుర్తుచేశారు. సుదీర్ఘమైన 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల హాకీ జట్టు స్వర్ణం కైవసం చేసుకోవడాన్ని, అలాగే పురుషుల హాకీ జట్టు కూడా పసిడి పతకంతో మెరవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్, కబడ్డీ విభాగాల్లో భారత్ 'డబుల్ గోల్డ్స్' సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనలను అభినందించారు. అథ్లెటిక్స్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంతో పాటు, 28 ఏళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం, 1982 తర్వాత మారథాన్‌లో విజయం వంటి చారిత్రక ఘనతలను ఆయన ప్రస్తావించారు. భారత్ సాధించిన మొత్తం 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలు సాధించడం నవభారత ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లో తొలిసారిగా పతకాలు సాధించడాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ప్రాతినిధ్యమే లేని క్రీడల్లోనూ నేడు భారత్ విజయకేతనం ఎగురవేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.

**క్రీడారంగానికి ప్రభుత్వ అండ**

గత దశాబ్ద కాలంగా క్రీడారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను మోదీ వివరించారు. ఒకప్పుడు దేశంలో క్రీడల పట్ల నెలకొన్న నైరాశ్యాన్ని అధిగమించి, నేడు నూతనోత్తేజంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్), 'ఖేలో ఇండియా' వంటి పథకాల ద్వారా పారదర్శకమైన, అత్యాధునిక క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడా సమాఖ్యలను బలోపేతం చేసేందుకు, క్షేత్రస్థాయి కార్యక్రమాల కోసం సుమారు రూ.36 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వెయ్యికి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు, నూతన స్టేడియంలు, స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రతిభావంతులైన అథ్లెట్లకు 'టాప్స్' కింద నెలకు రూ.50 వేల ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు, విదేశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ లో రాణించడంతో పాటు 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను వెలికితీయడానికి విస్తృతంగా 'టాలెంట్ హంట్' నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు తమ పాఠశాలలకు, గ్రామాలకు వెళ్లి అక్కడి చిన్నారుల్లో స్ఫూర్తి నింపాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడా స్ఫూర్తి జీవితంలో ఎదురయ్యే ఏ సవాలునైనా ధైర్యంగా ఎదుర్కొనేలా మనిషిని తీర్చిదిద్దుతుందని అభిప్రాయపడ్డారు. "ఆడేవాడే ఎదుగుతాడు" అనే తన సూత్రాన్ని పునరుద్ఘాటిస్తూ, "వికసిత భారత్" లక్ష్య సాధనలో క్రీడారంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

## ఢిల్లీలో సీజేపీ నిరసన.. అడ్డుకోలేమన్న హైకోర్టు

ఎన్నికల అక్రమాల ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అక్టోబర్ 16 (శుక్రవారం) ఢిల్లీ నడిబొడ్డున ఉన్న కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్‌లో జరగనున్న ఈ ఆందోళనను నిలువరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. నిరసనను చట్టప్రకారం నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన హామీని కోర్టు నమోదు చేసుకుంది. దసరా పండుగ సీజన్‌లో ఈ నిరసన వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, తద్వారా తీవ్రంగా నష్టపోతామని ఓ వీధి వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. కన్నాట్ ప్లేస్ నిరసనలకు వేదిక కాదని, ఈ ఆందోళనను నిలిపివేయాలని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. అయితే, సీజేపీ కార్యకలాపాలను నియంత్రించేందుకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కోర్టుకు విన్నవించారు. ఈ వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే, జస్టిస్ సంజయ్ శర్మలతో కూడిన ధర్మాసనం, నిరసనను నిలిపివేయడానికి



నిరాకరించింది. మరోవైపు, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల అక్రమాలపై గళమెత్తుతున్న విద్యార్థులు, యువతను పోలీసులు ఈడ్చిపారేస్తున్నారని ఆరోపించారు. వారికి మద్దతుగా వచ్చిన రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి ప్రతిపక్ష నేతలను సైతం నిర్బంధించారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ వెనకేసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ పిలుపునిచ్చిన ఈ నిరసనలో తాము కూడా పాల్గొంటామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది. నిరసనకారులు జాతీయ జెండాలతో తరలిరావాలని దీప్కే పిలుపునిచ్చారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పందిస్తూ ఎన్నికల సంఘానికి, కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది.

## 'సర్' వివాదం.. 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 'స్పెషల్ సమ్మరీ రివిజన్'..

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) ప్రక్రియపై చెలరేగుతున్న వివాదాల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. 'సర్' నిర్వహణలో తలెత్తిన లోపాలను సరిదిద్దే లక్ష్యంతో, 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాకు "స్పెషల్ సమ్మరీ రివిజన్" (ఎస్ఎస్ఆర్) చేపట్టాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఓటు హక్కు పొందే యువతతో పాటు, సాంకేతిక కారణాల వల్ల జాబితాలో పేర్లు నమోదు కాని వారిని చేర్చేందుకు ఈ ప్రక్రియ దోహదపడనుంది. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్, తమిళనాడు వంటి కీలక రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. 2027 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. తాజా షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 12న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం 2027 జనవరి 4న తుది జాబితాను విడుదల చేస్తారు. కాగా, 2027 ఫిబ్రవరి నాటికి ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యత సంతరించుకుంది.

**వివాదానికి దారితీసిన సర్**

'సర్' ప్రక్రియలో భాగంగా భారీస్థాయిలో ఓటర్ల పేర్లను తొలగించడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా, ఫారం-6తో పాటు ఓటర్లు ఒక అదనపు డిక్లరేషన్ సమర్పించాలన్న నిబంధన వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. సుమారు 20 ఏళ్ల క్రితం జరిగిన 'సర్' వివరాలతో ప్రస్తుత దరఖాస్తుదారుల తల్లిదండ్రుల వివరాలను అనుసంధానం చేయాలని కోరడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిబంధనలు అసంబద్ధంగా ఉన్నాయని, ఓటర్లను ఇబ్బందులకు గురిచేసేలా ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. ఈ వివాదం నేపథ్యంలో 'ఇండియా' కూటమి పార్టీలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వంటి యువజన సంఘాలు ఢిల్లీలో నిరసనలు చేపట్టాయి. తక్షణమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఏపీ, తెలంగాణలో పరిస్థితి ఏంటి?**

ప్రస్తుతం 'సర్' ప్రక్రియ కొనసాగుతున్న లేదా ఇటీవలే పూర్తయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో 'ఎస్ఎస్ఆర్' షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అదేవిధంగా, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇప్పటివరకు 'సర్' ప్రారంభం కాని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో కూడా ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను తగిన సమయంలో వెల్లడిస్తామని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సెప్టెంబర్ 29న ఇచ్చిన ఆదేశాల మేరకు, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని రాష్ట్రాల అధికారులకు సూచించినట్లు ఈసీ గుర్తు చేసింది.

## లక్ష్యం నెరవేరింది.. నక్సలిజం ముగిసింది



నక్సలిజం బస్తర్ ప్రాంతంలో పూర్తిగా అంతరించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పంతో ప్రధాని మోదీ 2026 మార్చి 31 గడువును విధించారని, భద్రతా బలగాల కృషితో ఆ లక్ష్యం నెరవేరిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనకు 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా, దివ్యాంగులు, నక్సల్ బాధితులకు సాయం అందించే కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అమిత్ షా పాల్గొన్నారు. దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించడం మాత్రమే సరిపోదని ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలో కలిసిన వాళ్లు తమ జీవితాన్ని పునర్నిర్మించుకోవాలని చెప్పారు.

ఒకప్పుడు తుపాకీ మోతలు, బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన బస్తర్ ప్రాంతంలో శాంతి పవనాలు వీచాయని షా చెప్పారు. నక్సలిజంలో మిగిలిన ఆనవాళ్లను కూడా పూర్తిగా తుడిచిపెట్టి, బస్తర్‌ను ప్రశాంతమైన, అభివృద్ధి చెందిన ప్రాంతంగా మార్చడానికి కేంద్రం పట్టుదలతో ఉందన్నారు. అదే సమయంలో కాంగ్రెస్?పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఛత్తీస్‌గఢ్‌లో దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ కనీసం ప్రాథమిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. కానీ, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం మాత్రం మౌలిక వసతులు, సౌకర్యాలను మెరుగుపరచడానికి నిరంతరం కృషి చేస్తోందని వెల్లడించారు. హింసాత్మక ప్రాంతాల్లో సాధారణ స్థితి, గిరిజన సంస్కృతిని పునరుద్ధరించడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో కలిసి కేంద్రం పలు చర్యలు తీసుకుంటున్నట్లు అమిత్ షా వివరించారు.

"ఐదు దశాబ్దాల పాటు నక్సలిజం ఎంతటి విధ్వంసాన్ని సృష్టించిందో, బస్తర్?లోని పేద ఆదివాసులను ఏ స్థాయిలో నష్టపరిచిందో ప్రపంచం మొత్తం ఈ గణాంకాల ద్వారా తెలుసుకోగలదు. ఏదైనా ఒక నిర్దోషి అయిన పౌరుడిని, వారి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఐఈడీ బాంబులు అమర్చి వారి చేతులు, కాళ్లు విసిరేస్తే అంతకంటే పెద్ద మానవ హక్కుల ఉల్లంఘన మరొకటి ఉండదు. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఒక దృఢ సంకల్పం ఉంది. 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని చెప్పాం. అనుకున్నట్లుగానే ఈ రోజు దేశంలో నక్సలిజం అంతమైపోయిందని చెప్పడానికి నాకు ఎంతో ఆనందంగా ఉంది. నక్సలిజం వల్ల గత ఐదు దశాబ్దాలుగా ఆ ప్రజలు పడిన వేదనను మనం అంతం చేయలేం. ఆ బాధలు ఎవరినైతే గాయపరిచాయో, వారికి మనం ఓదార్పునివ్వాలి. వారిని నిలబెట్టేందుకు ప్రయత్నం చేయాలి. వారు ఆత్మగౌరవంతో జీవించేలా తగిన ఏర్పాట్లు చేయాలి."

**వారికి మద్దతు ఇవ్వడమే ఈ సేవా కార్యక్రమం ముఖ్యఉద్దేశం**

'సేవా సంకల్ప్? అభియాన్?' కార్యక్రమం ద్వారా దాదాపు 3,600 మందికి పైగా దివ్యాంగులు లబ్ధి పొందారని అమిత్? షా పేర్కొన్నారు. అక్టోబర్? 5 నుంచి 7 వరకు నిర్వహించిన కార్యక్రమంలో ఒక్క బస్తర్?లోనే 1,570 మంది లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నక్సలిజం కారణంగా అంగవైకల్యానికి గురైన గిరిజనులకు కృత్రిమ అవయవాలు అందిస్తుండటం పట్ల షా సంతృప్తి వ్యక్తం చేశారు. నక్సలిజం ఐదు దశాబ్దాల పాటు ఛత్తీస్?గఢ్?ను ఎంతగా పీడించిందో అక్కడి వికలాంగుల సంఖ్యను బట్టి అంచనా వేయవచ్చునని షా పేర్కొన్నారు. నక్సలిజం వల్ల జీవితాలు ప్రభావితమైన వారికి మద్దతు ఇవ్వడమే ఈ సేవా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నొక్కి చెప్పారు. ఒకప్పుడు ఛత్తీస్?గఢ్? అభివృద్ధికి నక్సలిజం పెద్ద అడ్డంకిగా ఉండేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్ ?సాయి పేర్కొన్నారు. అయితే, ప్రధాని మోదీ నాయకత్వంలో నక్సలిజం నిర్మూలన దిశగా తీసుకుంటున్న చర్యలు రాష్ట్రానికి దక్కిన గొప్ప ప్రయోజనాల్లో ఒకటని అన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137